ప్రజాశక్తి
సోమవారం 12 మే 2025 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

ఈ వేసవిలోనైనా..
మరమ్మతులు జరిగేనా.?

- ప్రతిపాదనకే పరిమితమవుతున్న పనులు
- కూటమి ప్రభుత్వంలోనూ నిధులు రాక జరగని మరమ్మతులు

మరమ్మతులకు నోచుకోని పర్చూరు డ్రైన్ (ఫైల్)

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

కూటమి ప్రభుత్వ హయాంలో అయినా సకాలంలో అన్ని పంట కాలువలు, మురుగు కాలువల మరమ్మతులు పనులు ఈ వేసవిలో చేపట్టి పూర్తి చేస్తారా.? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా వేసవి కాలంలోనే అన్ని పంట కాలువలు, మురుగు కాలువల మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. ఇందుకోసం సంబంధిత శాఖల ఇంజినీరింగ్ అధికారులు ముందుగానే ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపుతారు. ప్రభుత్వం నుంచి అనుమతులు వస్తే టెండర్లు పిలిచి పనులు చేపట్టడం జరుగుతుంది. కానీ ప్రతి ఏటా ప్రతిపాదనలు అయితే వెళుతున్నాయి గానీ సకాలంలో నిధులు మంజూరు కాకపోవడంతో పనులు చేపట్టలేని పరిస్థితి నెలకొంటోంది. ఒకవేళ టెండర్లు పిలిచి పనులు చేపట్టాలన్నా గత అనుభవాల దృష్ట్యా కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. నిధుల మంజూరు, టెండర్ల ప్రక్రియ జాప్యం జరిగి వ్యవసాయ సీజన్ ప్రారంభం అయ్యాక పనులు అరకొరగా జరిగాయి. దీంతో గత వైసిపి ప్రభుత్వ హయాం అంతటా ఇదే పరిస్థితి కొనసాగింది. ప్రభుత్వం మారిన నేపథ్యంలో గతం లాగా కాకుండా మురుగు కాలువల మరమ్మతుల పనులు సకాలంలో జరుగుతాయని రైతులు ఆశించారు. కానీ వేసవికాలం మరో రెండు నెలల్లో ముగియనున్నప్పటికీ ఇంతవరకు డ్రైన్ల ▶ 2లో

గోడు తప్ప ఏముంది.?

- గత డిఆర్సీలో చర్చించినవన్నీ యథాతదం
- ఏ ఒక్కటీ కార్యరూపం దాల్చని దైన్యం
- నేడు మళ్లీ డిఆర్సీ.. హాజరుకానున్న ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

గోడు తప్ప ఆచరణలో ఏమీ లేదు. గత డిఆర్సిలో అనేక అంశాలు చర్చకు వచ్చాయి. ఇన్‌ఛార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కూడా అన్నీ విన్నారు. చర్చలు.. అభిప్రా యాలు అన్నీ కాగితాలపై పెట్టారు. ఆచరణలో ఏం జరిగిందంటే అవన్నీ యదాతథంగానే ఉన్నాయి. ఏ ఒక్కటీ కార్యరూపం దాల్చలేదు. ముందుకు సాగలేదు. కారణం నిధుల్లేక కొన్ని ఆగిపోగా.. రాష్ట్ర ప్రభుత్వం చేతిలో కొన్ని నిర్ణయాలు పెండింగులో ఉన్నాయి. వెరసి అప్పుడు చర్చకు వచ్చినవన్నీ అలాగే ఉన్నాయి.

గత డిఆర్సీలో ప్రధానంగా చర్చకు వచ్చిన అంశాలను చూస్తే 'జిల్లా విభజన'. దీనిపై పలువురు మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మార్కాపురం జిల్లా ఏర్పాటుతో పాటు కందుకూరు, అద్దంకి నియోజక వర్గాలు ప్రకాశంలో కలపాలన్న దానిపై ఎమ్మెల్యేలు గోడు వినిపించారు. రాష్ట్రప్రభుత్వం దృష్టికి తీసుకుపోతామని మంత్రులు హామీ ఇచ్చారు. దానిపై ఇంతవరకూ చర్చలేదు. ఎందుకంటే మంత్రివర్గంలో నిర్ణయం జరగాలి. ఎవరూ దానిపై చర్చ పెట్టిన దాఖలాల్లేవు. ఉమ్మడి ప్రకాశంలో ఇద్దరు మంత్రులు గానీ, ఇన్‌ఛార్జి మంత్రి గానీ ఈవిషయాన్ని కేబినెట్‌లో ప్రస్తావిస్తే కొంత ఉపయోగం ఉండేది. ఎవరూ ఆ సాహసం చేయలేదు. దీంతో ఈ వ్యవహారం ఏడాదిగా అలాగే ఉంది. సిఎం చంద్రబాబు మార్కాపురం ప్రాంతానికి వచ్చినా దీనిపై స్పష్టంగా చెప్పలేదు.

మరో ఎజెండా వెలుగొండ ప్రాజెక్టు. దీన్ని ఏడాదిలో పూర్తి చేస్తామన్నారు. ఏడాది కావస్తోంది. ఆ హామీకి చెదలు పట్టినట్లే.. గత డిఆర్సీలోనూ దీనిపై సభ్యులు మాటాడారు. నిర్వాసితుల విషయం ప్రస్తావనకు వచ్చింది. అయితే రాష్ట్ర బడ్జెట్‌లో దీని అవసరాలకు తగ్గట్లుగా నిధుల కేటాయింపు లేదు. ఇటీవల మంత్రివర్గంలో రూ.106 కోట్లు కేటాయించారు. కాలువల పనుల కోసం వీటిని ఇస్తున్నారు. నిర్వాసితులకు రూ.889 కోట్లు కావాల్సి ఉంది. కలెక్టర్ కూడా ఇటీవల జరిగిన కలెక్టర్ల సమావేశంలోనూ సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకుపోయారు. నిధులు రాలేదు. పనులు కూడా నత్తనడకన సాగుతున్నాయి. వెలిగొండపై చర్చలు తప్ప చర్యలు లేవు. చిత్తశుద్ధితో మాత్రం దీని పనులు సాగడం లేదన్నది వాస్తవం.

జిల్లా డెయిరీపైనా చర్చ నడిచింది. దీన్ని తిరిగి పునరుద్ధరించాలని నిర్ణయించారు. ఎన్నికలకు ముందు కూడా ఇదే చెప్పారు. ఒంగోలు పట్టణంలోనే పాలపొడి ఫ్యాక్టరీతో పాటు అప్పట్లో కట్టిన భవనాలు ఉన్నాయి. ఇప్పుడు ఈ భూముల విలువే రూ.కోట్లలో ఉంది. అప్పటి ప్రభుత్వం గుజరాత్ డెయిరీ అమూల్‌కు అప్పగించింది. గ్రామాల్లో కేంద్రాలు కూడా కట్టారు. ఇంకా పూర్తి కాలేదు. ఇప్పుడూ అదే పరిస్థితి కొనసాగుతోంది. జిల్లా డెయిరీని గుజరాత్ గుప్పెట్లోనే ఉంది. దీన్ని తిరిగి పునరుద్ధరించాలనే ▶ 2లో

నామినేటెడ్ పదవుల జోరు

- పిడిసిసి బ్యాంకు ఛైర్మన్‌గా డాక్టర్ కె.సీతారామయ్య
- డిసిఎంఎస్ ఛైర్మన్‌గా శ్యామల కాశిరెడ్డి నియామకం
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

దామచర్లకు కృతజ్ఞతలు తెలియజేస్తున్న కె.సీతారామయ్య

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత నామినేటెడ్ పదవుల నియామకం జోరు కొనసాగుతోంది. ప్రకాశం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(పిడిసిసిబి) ఛైర్మన్‌గా ఒంగోలుకి చెందిన డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ(డిసిఎంఎస్) ఛైర్మన్‌గా వెలిగండ్ల మండలం వెదుళ్లచెరువుకి చెందిన శ్యామల కాశిరెడ్డిని నియమించింది.

పిడిసిసి బ్యాంకు ఛైర్మన్‌గా నియమితులైన డాక్టర్ కామేపల్లి సీతారామయ్య తెలుగుదేశం పార్టీకి విధేయుని పార్టీగా బలోపేతానికి కృషి చేస్తున్నారు. ఒంగోలు నగరంలోని వెంకట రమణ నర్సింగ్ హోం ద్వారా గత 54 సంవత్సరాలుగా జిల్లా ప్రజలకు వైద్య సేవలు అందిస్తోంది. డాక్టర్ సీతారామయ్య తండ్రి డాక్టర్ కామేపల్లి వెంకట రమణారావు ఎన్టీఆర్ హయాంలో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. తరువాత కాలంలో డాక్టర్ కె.సీతారామయ్య పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. 2014-19 మధ్య కాలంలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు డాక్టర్ కె.సీతారామయ్యను ఒంగోలు జిజిహెచ్ అభివృద్ధి కమిటీ ఛైర్మన్‌గా నియమించారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్‌గా డాక్టర్ సీతారామయ్య తనకు ఉన్న పరిచయాలు, స్నేహితుల ద్వారా రిమ్స్ అభివృద్ధికి పాటుపడ్డారు. 2024 సాధారణ ఎన్నికలలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు అత్యధిక మెజార్టీతో గెలిచేందుకు డాక్టర్ కె.సీతారామయ్య కీలక పాత్ర పోషించారు. పిడిసిసి బ్యాంకు ఛైర్మన్‌గా డాక్టర్ కె.సీతారామయ్య పేరును ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు ప్రతిపాదించి ఉమ్మడి ప్రకాశం జిల్లా మంత్రులు గొట్టిపాటి రవి కుమార్, డిబివి స్వామి, జిల్లాలోని ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ఆమోదించేలా కృషి చేశారు. ఈ పదవి రేసులో పలువురు పేర్లు వినిపించినా డాక్టర్ కె.సీతారామయ్యను పదవి కేటాయిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పిడిసిసి బ్యాంకు ఛైర్మన్‌గా డాక్టర్ కె.సీతారామయ్య నియమించటం పట్ల కూటమి నేతలలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

ఎమ్మెల్యే దామచర్లకు కృతజ్ఞతలు

పిడిసిసి బ్యాంకు ఛైర్మన్‌గా నియమించేందుకు సహకరించిన ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావుకు డాక్టర్ కె.సీతారామయ్య కృతజ్ఞతలు తెలియజేశారు. స్థానిక ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావును కలిసిన సిడిసిసి బ్యాంకు ఛైర్మన్ డాక్టర్ కె.సీతారామయ్య ఘనంగా సత్కరించి.. మొక్కను బహూకరించారు. కార్యక్రమంలో డాక్టర్ నామినేని కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

డిసిఎంఎస్ ఛైర్మన్‌గా శ్యామల కాశిరెడ్డి

జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ ఛైర్మన్‌గా వెలిగండ్ల మండలం వెదుళ్ల చెరువు గ్రామానికి చెందిన శ్యామల కాశిరెడ్డి ▶ 2లో

కాశిరెడ్డి

ప్రభుత్వమే
బర్లీ పొగాకు కొనాలి

- రైతు సంఘం జిల్లా నాయకులు గంగయ్య డిమాండ్

మాట్లాడుతున్న గంగయ్య

ప్రజాశక్తి-పర్చూరు

ప్రభుత్వం ఎన్ని హామీలు ఇచ్చినా.. ఆచరణలో కంపెనీలతో వైట్‌బర్లీ కొనుగోలు చేయించలేని పరిస్థితి ఏర్పడిందని రైతు సంఘం జిల్లా నాయకులు సిహెచ్ గంగయ్య విమర్శించారు. ప్రభుత్వమే బర్లీ పొగాకు కొనాలని డిమాండ్ చేశారు. మండలంలోని చెరుకూరు పంచాయతీ కార్యాలయం వద్ద బర్లీ పొగాకు రైతులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వమే నేరుగా రంగంలోకి దిగి ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా కొనుగోలు చేయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పంట ప్రోత్సహించిన వ్యాపారులు ఇప్పుడు కొనడం లేదని, ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో బర్లీ పొగాకు రైతులు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాపారుల ఇష్టా రాజ్యమైందని విమర్శించారు. ప్రభుత్వమే కొనుగోలు చేస్తే తప్ప రైతులకు గిట్టుబాటు ధర వచ్చే మార్గం లేదని అన్నారు. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కౌలు రైతుల పరిస్థితి చాలా దారుణంగా ఉందన్నారు. ఈ పాటికే మండలంలోని వీరన్నపాలెం కౌలు రైతు ఉప్పు టూరి సాంబశివరావు మతి చెందగా.. ఇంకొల్లు మండలం దుద్దుకూరుకు చెందిన మరొక రైతు బిల్లా శాంసన్ ఆత్మహత్యకు యత్నించి.. చికిత్స పొందుతున్నారని పేర్కొన్నారు. వీరిద్దరూ కౌలు రైతులని వివరించారు. వారి కుటుంబాలు వీధిన పడే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ప్రభుత్వం వెంటనే వారిని ఆదుకోవాలని కోరారు. సమావేశంలో సిఐటియు నాయకులు కొమ్మినేని శ్రీనివాసరావు, కౌలు రైతులు సాదిక్, శివయ్య, రైతులు పాల్గొన్నారు.

చిరుతిండి... జర భద్రమండి

- ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం

- పౌష్టికాహారం మేలంటున్న వైద్య నిపుణులు

ప్రజాశక్తి-కొండపి

చిరుతిండ్లు చిన్నారులకు ప్రాణాంతకంగా మారాయి. ఆకర్షించే రంగులతో తయారు చేస్తుండటంతో చిన్నారులు ఆకర్షితులవుతున్నారు. తయారీలో నాణ్యత కొరవడటంతో ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయి. కొండపి మండలంలో దాదాపు కొన్ని పదుల సంఖ్యలో దుకాణాల్లో నాణ్యత లేని ఆహార పదార్థాల విక్రయిస్తున్నారు. చూడగానే చిన్నారుల కొనివ్వాలంటూ మారం చేస్తుండటంతో తప్పని పరిస్థితుల్లో తల్లిదండ్రులు కొనుగోలు చేయడం పరిపాటిగా మారింది. ఈ పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో పెను ముప్పు తప్పదని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వ్యాపారులు ధనార్జనే ధ్యేయంగా నకిలీ చిరుతిండ్లను విచ్చలవిడిగా మార్కెట్‌లోకి తీసుకొస్తున్నారు. స్నాక్స్, చిరుతిండ్లు, ప్యాకింగ్‌పై చిరునామ ఉండదు. సంస్థపేర్లు కూడా అర్థం కావు. మరికొన్ని ప్రముఖ కంపెనీలను పోలి ఉండే ప్యాకింగ్ తయారు చేసి మార్కెట్‌లోకి వదులుతున్నారు. కొందరు బడా వ్యాపారులు నకిలి కంపెనీల స్నాక్స్ తయారు చేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఎక్కువ రోజులు నిల్ల ఉండటం కోసం వివిద రకాల రసాయనాలు కలుపుతున్నారు. రుచి కోసం ఎక్కువ మోతాదులో మాసాలా, ఆకర్షణీయమైన రంగు కోసం ప్రమాదకర పొడులు వినియోగిస్తున్నారు. వీటిని తినడంతో భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలు తప్పవని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

కల్తీ ఆహార నిరోదిక చట్టం అమలు ఏదీ?

వ్యాపార దుకాణాల్లో తినుబండారాల నాణ్యతను పర్యవేక్షించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తు న్నారు. మొక్కుబడి తనిఖీలు చేసి చర్యలు మాత్రం తీసుకోవడంలో లేదని ప్రజా సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. చాలామంది తయారీ చేసే వస్తువులకు అనుమతుల లేకున్నా విచ్చలవిడిగా విక్రయాలు చేపట్టడం విడ్డూరం. కల్తీ ఆహారం పట్టణాలకే కాకుండా గ్రామాల్లో విస్తరిస్తోంది. పాఠశాలలు, కళాశాలలు వద్ద రకరకాల బ్రాండ్‌లతో కల్తీ ఆహార పదార్థాల విక్రయాలు జోరందుకున్నాయి. అధికంగా వాటిని తినడంతో విద్యార్థులు అనారోగ్యం పాలువుతున్నారు. ఆహారం కల్తీ నివారణ నిరోధక చట్టం 1954లోనే అమల్లోకి వచ్చినా విక్రయాలను అరికట్టడంలో అధికారులు విఫలమవుతున్నారు.

ఫిర్యాదు ఇలా..

ఆహార కల్తీపై జిల్లాలోని ఆహార తనిఖీ వారు, రాష్ట్ర కేంద్ర ఆరోగ్య శాఖల డైరెక్టర్లకు పిర్యాదు చేయవచ్చు. కల్తీ చేయాలనే ఆలోచన లేకపోయినా కల్తీ జరిగినా ఆహారాన్ని సరఫరా చేసి విక్రయించేవారు కల్తీదారుడిగా శిక్షార్హుడే.

నివారణకు చర్యలు తీసుకోవాలి

ఎం వెంకటేశ్వర్లు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, కొండపి

పిల్లలకు ప్రమాదకరమైన చిరుతిండ్లు ఇవ్వడానికి ముందుగా పెద్దల్లో మార్పు రావాలి. సహజ సిద్ధమైన పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలను పిల్లలకు అలవాటు చేయాలి. మార్కెట్‌లో నాణ్యమైన ఆహార పదార్థాలు వచ్చే విదంగా చర్యలు తీసుకోవాలి.

పౌష్టికాహారం ఉత్తమం: డాక్టరు అనూషా, పెట్లూరు వైద్యాధికారి

కొవ్వు పదార్థాలతో తయారైన ఆహారాలను తింటే రోగాలు వచ్చే అవకాశం ఉంది. పిల్లలకు చిరుతిండ్ల నుంచి దూరం చేస్తే బాగుంటుంది. మార్కెట్‌లో ఆహార పదార్థాలు కొనుగోలు చేసే ముందు కంపెనీ.. సమయం ఉందా లేదా అని తేడా చూసిన తరువాత కొనుగోలు చేయడం ఉత్తమం. పండ్లు, కూరగాయలు, పౌష్టికాహారం తీసుకోవడం మంచిది.

రత్నం జూనియర్ కాలేజ్ వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంటలో నిల్వ ఉన్న నీరు

ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే దారి వద్ద అధ్వానంగా ఉన్న రోడ్డు

అధ్వాన రహదారితో ఇబ్బందులు

ప్రజాశక్తి-సిఎస్ పురం రూరల్

మండల కేంద్రం సిఎస్పురంలో సిఎస్పురం నుంచి డిజిపేట వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉండడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

సిఎస్పురంలోని కనిగిరి రోడ్డు జంక్షన్ నుంచి డిజిపేట వెళ్లే రోడ్డులో 167 బి జాతీయ రహదారి వరకు దాదాపు కిలోమీటర్ పైగా ఉన్న రోడ్డు ఆర్అండ్‌బి రోడ్డుగా ఉంది. గ్రీన్ ఫీల్డ్ రోడ్డు హైవే నిర్మాణం కోసం పనిచేస్తున్న టిప్పర్లు, భారీ వాహనాలు ఈ రోడ్డు వెంట తిరుగుతూ ఉండడంతో రోడ్డు మొత్తం ధ్వంసం అయిపోయింది. ప్రధానంగా సిమెంట్ కొట్టు లక్ష్మిరెడ్డి ఇంటి వద్ద నుంచి రత్నం జూనియర్ కాలేజీ వరకు పెద్ద పెద్ద గుంటలు ఏర్పడి వర్షం వచ్చినప్పుడు నీరు నిల్వ ఉంటూ పరిసర ప్రాంత గృహాల ప్రజలకు, వాహనదారులకు, పాదచారులకు తీవ్ర ఇబ్బందులు కలగజేస్తున్నది. అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయించి ఇబ్బందులు తీర్చాలని పరిసర ప్రాంత గృహాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

గోడు తప్ప ఏముంది?

(మొదటిపేజీ తరువాయి)

ఆలోచన లేదు. 40 వేల రైతులకు మేలు చేసే జిల్లా డెయిరీని నిర్వీర్యం చేశారు. ప్రవేటు డెయిరీలకు రైతులను వదిలేశారు. తెలుగు దేశం హయాంలోనే ఇది మూతపడింది. ఉద్యో గులను ఏదో రకంగా ఇంటికి పంపారు. చదల వాడ పశుక్షేత్రంపైనా చర్చ సాగింది. ఆవులను బాగా పెంచి నెయ్యి ఉత్పత్తిని పెంచవచ్చని చర్చ సాగింది. సమావేశంలోనూ దీనిపై సానుకూలంగానే నిర్ణయం చేశారు. అయితే పశుక్షేత్రం అభివృద్ధికి రూపాయి కేటాయిం చడం గానీ, అభివృద్ధి చేయడం గానీ ఏమీ జరగలేదు. ఇంకా దేవాదాయ భూముల వ్యవహారాలు, చెరువులు, సాగునీటి సమస్యలు వంటివి చర్చకు వచ్చాయి. అవన్నీ యధాతథం గానే ఉన్నాయి. ఇక ప్రస్తుతం వేసవి కావడంతో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. ఇప్పటికే పశ్చిమాన అనేక చోట్ల ట్యాంకర్లతో నీటిని అందిస్తున్నారు. ఇప్పుడు సమావేశంలో దీనిపైనా చర్చ సాగనుంది. మరోసారి ఏకరువు పెట్టినా ఫలితం ఏమిటన్నదే ప్రశ్న. డిఆర్‌సీ కొత్త ఎజెండా ఏమిటన్నదీ చూడాలి.

నామినేటెడ్ పదవుల జోరు

(మొదటిపేజీ తరువాయి)

నియమితులయ్యారు. ఈయన వృత్తి వ్యాపారం.. ప్రవత్తి సమాజసేవ. గత 20 సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీలో పనిచేస్తున్నారు. కనిగిరి ఎమ్మెల్యేగా కదిరి బాబురావు ఉన్నప్పుడు టిడిపి మండల పార్టీ అధ్యక్షునిగా పనిచేశారు. వెలిగండ్ల మండలంలో తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి విశేష కషి చేస్తున్నారు. తన తండ్రి పేర శ్యామల వెంకట్ రెడ్డి ఫౌండేషన్ ఏర్పాటు చేసి గత 14 సంవత్సరాలుగా అనేక సేవా కార్యక్రమాలు చేపట్టారు. ప్రతి ఏడాది నియోజకవర్గస్థాయిలో ప్రభుత్వ పాఠశాలలో చదివే పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్, ఇతర వస్తువులు అందజేస్తున్నారు. ప్రతి సంవత్సరం చలివేంద్రాలు ఏర్పాటు చేయటం, ప్రభుత్వ పాఠశాల లకు సొంత నిధులతో మౌలిక వసతులు ఏర్పాటు చేస్తున్నారు. ముంబైలో తాను స్థాపించిన కంపెనీలో స్వగ్రామమైన వెదుళ్ల చెరువు నుండి దాదాపు 20 కుటుంబాలను తీసుకెళ్లి ఉద్యోగాలు కల్పించి జీవనభతి కల్పించారు. కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డికి విధేయు డిగా ఉంటూ పార్టీకి అంకితభావంతో పనిచేస్తున్నారు. ఎమ్మెల్యే, కార్యకర్తలకు అనుసంధానంగా ఉంటూ పార్టీ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటున్నారు.

వ్యాపార రంగాల్లో అందరూ అభివృద్ధి చెందాలి: సత్య

ప్రజాశక్తి-శింగరాయకొండ

కాఫీ షాపును ప్రారంభిస్తున్న సత్య

వ్యాపార రంగాల్లో అందరూ అభివృద్ధి చెందాలని రాష్ట్ర మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య అన్నారు. ఆదివారం నాడు శింగరాయకొండ జాతీయ రహదారి పరిధిలోని కనుమల్ల కాలికివాయి మధ్యలో ఉన్న రన్వే మీద జరుగుమల్లి మండలం కే.బిట్రగుంట గ్రామానికి చెందిన చిమ్మిడి సురేష్‌కు చెందిన కుంభకోణం డిగ్రీ కాఫీ షాపును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రారంభించి అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణా కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-దర్శి: ప్రముఖ వ్యాపారవేత్త ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు కోట హనుమంతరావు ఆధ్వ ర్యంలో దర్శిలోని నిరుద్యోగుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని గొట్టిపాటి లక్ష్మీ ప్రారంభించారు. ఆదివారం పొదిలి రోడ్డులోని ఎస్‌సిడి కంప్యూటర్ సెంటర్‌లో ప్రారంభించారు. విద్యార్థులకు అట్టలు, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఆర్యవైశ్య నాయకులు కొల్లా చెంచయ్య, శ్రీనివాసరావు విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ వేసవిలోనైనా మరమ్మతులు జరిగేనా.?

(మొదటిపేజీ తరువాయి)

ఆధునీకరణకు నిధులు మంజూరు అయిన పరిస్థితి లేదు. చీరాల డ్రైనేజి డివిజన్‌లో చేరి ఉన్న పర్చూరు నియోజకవర్గంలోని డ్రైన్ల మరమ్మత్తుల కోసం 14 పనులు చేపట్టేందుకు రూ 1.80 కోట్లతో, చీరాల నియోజకవర్గం పరిధిలో 4 పనుల కోసం రూ.1.37 కోట్లతో, బాపట్ల నియోజకవర్గం పరిధిలో రూ 81.73 లక్షల అంచనాలతో ఆరు పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు పంపారు. నేటికీ అనుమతులు రాలేదు. అనుమతులు వచ్చి టెండర్లు పిలిచి, పనులు చేపట్టేప్పటికి వర్షాలు పడడం మొదలవుతుంది. ఇక మరమ్మతులు జరిగే పరిస్థితి ఉండదు.

ప్రతి ఏటా పంటలను నష్టపోతున్న రైతులు

జిల్లా రైతులు ప్రతి ఏటా పంట చేతికి అందివస్తున్న సమయంలో సంభవిస్తున్న తుపాన్లు, వరదల కారణంగా పొలాలు నీట మునిగి తీవ్రంగా నష్టపోతున్నారు. వరదనీటిని వేగంగా దిగువకు తీసుకెళ్లి.. సముద్రంలో కలిపే మురుగు కాలువలు ఏళ్లతరబడి మరమ్మతులకు నోచుకోలేదు. మురుగు నీటి కాలువలు, వాగుల్లో విపరీతంగా గుర్రపుడెక్క, జమ్ము పెరిగి ఉంది. ఈ కారణంగా నీటి ప్రవాహం సాఫీగా దిగువకు వచ్చే పరిస్థితి ఉండడం లేదు. దీంతో పంటపొలాలు ముంపుకు గురై ఏటా రైతులు నష్టపోతున్నారు. తుపానులు, భారీ వర్షాల కారణంగా సంబవించే వరదల వల్ల జిల్లా లోని ఎగువ ప్రాంతం నుంచి వచ్చే మురుగునీరు జిల్లా పరిధిలో ఉన్న నల్లమడ, రొంపేరు, వేటపాలెం, ఈపురుపాలెం స్ట్రయిట్‌కట్‌లు, పేర్లి, తుంగభద్ర, కొల్లిమర్ల లాంటి పెద్ద డ్రయిన్లతో పాటు పలు చిన్నపాటి డ్రయిన్ల ద్వారా సముద్రంలో కలవాల్సి ఉంది. కానీ గత వైసిపి ప్రభుత్వ హయాం నుంచి ఈ డ్రైన్లకు సకాలంలో మరమ్మతులు చేయించిన పరిస్థితి లేదు. మరమ్మతుల పనులు వేసవిలో చేపట్టి పూర్తి చేస్తే రైతులకు మేలు జరుగుతుంది. కానీ ప్రతి ఏటా వేసవిలో కాకుండా వర్షాలు కురిసి పంట కాలువలకు నీరు విడుదల చేసే నాటికి కూడా పనులు చేపడుతున్న పరిస్థితి లేదు. దీంతో అరకొరగా పనులు చేయడం వరదల నాటికి పంట పొలాలు మునిగిపోవడం పరిపాటి అయ్యింది. ఈ ఏడాది అయినా సకాలంలో మురుగునీటి కాలువల మరమ్మతుల గురించి పట్టించుకున్న దాఖలాలు లేకుండా పోయింది. ఇటీవల పంటకాలువలు, మురుగు కాలువల మరమ్మతుల విషయమై అధికారులతో సమీక్ష జరిపిన జిల్లా కలెక్టర్ కాల్వల అభివద్ధి పనులు వేగంగా చేపట్టాలన్నారు. జిల్లాలో మైనర్ కాల్వలపై 119 మరమ్మతు పనులకు రూ.10.68 కోట్లు నిధులు మంజూరయ్యాయన్నారు. పంట కాల్వల మరమ్మతు పనులు, పూడికతీత పనులు చేయడానికి ప్రభుత్వం 454 పనులు గుర్తించిందన్నారు. యుద్ధప్రాతిపదిక వాటిని చేపట్టేందుకు రూ.12.59 కోట్లు నిధులు జిల్లాకు మంజూరయ్యాయన్నారు. వరద ప్రభావంతో దెబ్బతిన్న పంట కాల్వలకు తాత్కాలిక మరమ్మతులు చేయడానికి 148 పనులు గుర్తించామన్నారు. రూ.7.75 కోట్ల నిధులు మంజూరయ్యా యన్నారు. కానీ నిధులు మంజూరు అంటూ కాగితాలపై చూపుతున్నారు తప్ప వాస్తవ పరిస్థితి అలా లేదు. నిధులు వచ్చే పరిస్థితి లేకపోవడంతో పనులు చేపట్టడం లేదు. ప్రస్తుత వేసవి లో పనులు చేపట్టి సకాలంలో పూర్తి చేయలేకపోతే రైతులకు కష్టనష్టాలు తప్పేలా లేవు. ప్రభుత్వం మరమ్మతు పనుల కోసం తక్షణమే నిధులు విడుదల చేసి రైతులను ఆదుకోవాల్సి ఉంది.

నోటీసు (ఆర్డర్ 21 రూల్ 34 ఆఫ్ సి.పి.సి)
మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో,
చీరాల,
E.P No.7/2025
in
O.S.No. 56/2017
between
శ్రీమతి నారిశెట్టి సుబ్బులు, W/o సుబ్బారావు,
72 సం.లు, హిందూ, హౌస్ వైఫ్, రామకృష్ణాపురం,
చీరాల మండలం.
...వాది/డిక్రీ హోల్డర్
మరియు
సిఖాకొల్లి నాగలక్ష్మి ...ప్రతివాది/ జడ్జిమెంట్ డెటార్
To
సిఖాకొల్లి నాగలక్ష్మి, W/o రంగనాయకులు,
53 సం.లు, హిందూ. బిజినెస్,
డోర్ నెం. 11-25, రామకృష్ణాపురం,
చీరాల మండలం.
పై నెంబరు EPని డిక్రీ హోల్డర్ EP షెడ్యూల్ దాఖల్లో స్థిరాస్తిని draft sale deed ప్రకారం తన పేరన register sale deedని వ్రాయించి ఇవ్వమని కోరుచూనీపై దాఖలు చేసి యున్నారు. ఇందు నిమిత్తమై నీకు ఏమైనా అభ్యంతరములు ఉన్నయెడల ది. 20.06 2025వ తేదీన పై కోర్టు వారి యెదుట స్వయంగా కానీ, లేదా వకీలు ద్వారా కానీ హాజరు అయ్యి మనవి చేసుకొనవలెను. లేనిచో నీపరోక్ష మందు విచారించి తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియజేయడమైనది.
ప్రకటన జారీ చేయువారు
బండారుపల్లి హేమంత కుమార్,
బి.కాం, బి.యల్,
అడ్వకేట్ & నోటరి (భారత ప్రభుత్వం),
చర్చి కంపౌండ్ చీరాల - 523 157
సెల్: 9440242350

ప్రజాశక్తి
సోమవారం 12 మే 2025

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

పలువురికి గాయాలు

వేరువేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందగా పలువురికి గాయాలయ్యాయి. యర్రగొండపాలెం పాలెం మండలం బోయలపల్లి సమీపంలో అడవిపందిని బైక్ ఢీకొనడంతో హోంగార్డు మృతి చెందాడు. సంతమాగులూరు మండలంలో కొమ్మాలపాడు, రామాంజనేయపురం గ్రామాల మధ్య నామ్ రోడ్డుపై గుర్తు తెలియని వాహనం వ్యక్తి మృతి చెందాడు. శింగరాయకొండలో కందుకూరు రోడ్డు ఫ్లైఓవర్ వద్ద బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఒకరికి గాయాలు కాగా, నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడు వద్ద ట్రావెల్స్ బస్సును ఢీకొన్న కారు బోల్తాపడటంతో ఇద్దరికి గాయాలయ్యాయి. అలాగే పొన్నలూరు మండలంలో చెన్నుపాడు అడ్డరోడ్డు వద్ద బైక్ అదుపుతప్పి మరో ఇద్దరికి గాయాలయ్యాయి.

రోడ్డు ప్రమాదంలో హోంగార్డు మృతి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం : యర్రగొండపాలెం పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న యర్రగుంట శ్రీరాములు (32) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మార్కాపురం మండలం యాచవరం గ్రామానికి చెందిన శ్రీరాములు యర్రగొండపాలెం మండలంలోని వాదంపల్లి గ్రామంలో వివాహం చేసుకున్నాడు. డ్యూటీ నిమిత్తం వాదంపల్లి నుంచి యర్రగొండపాలెం వచ్చి విధులు నిర్వహించి తిరిగి వాదంపల్లి వెళ్తుంటారు. ఈ క్రమంలోనే శనివారం రాత్రి డ్యూటీ ముగించుకొని వాదంపల్లి వెళుతుండగా 565 జాతీయ రహదారిపై బోయలపల్లి సమీపంలో అడవి పంది ఢీకొంది. దీంతో శ్రీరాములుకు యర్రగొండపాలెంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో చేర్పించి ప్రాథమిక చికిత్సలు చేయించారు. మెరుగైన చికిత్సల నిమిత్తం గుంటూరుకు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. యర్రగొండపాలెం సిఐ సిహెచ్ ప్రభాకరరావు, ఎస్సై పి.చౌడయ్య శ్రీరాములుకు చికిత్స అందించే విషయంలో తీవ్రంగా కృషి చేశారు. అయినప్పటికీ శ్రీరాములు మృతి చెందడం పట్ల వారు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. మృతి చెందిన శ్రీరాములుకు పోలీస్ సిబ్బంది నివాళులర్పించారు. కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు. ఆయనకు ఇద్దరు ఆడ పిల్లలు, భార్య ఉన్నారు.

శ్రీరాములు (ఫైల్)

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

సంతమాగులూరు : మండలంలోని కొమ్మాలపాడు, రామాంజనేయపురం గ్రామాల మధ్య అద్దంకి-నార్కెట్ పల్లి రహదారిపై ఆదివారం గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందాడు. అందిన వివరాల ప్రకారం.. అద్దంకి టౌన్ కొత్తపేటకు చెందిన గుంజి రామాంజనేయులు మోటార్ సైకిల్‌పై కొమ్మాలపాడు వైపు వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. దీంతో రామాంజనేయులుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనంలో నరసరావుపేట మహాత్మా గాంధీ హాస్పిటల్‌కు తరలించి చికిత్స నిందించారు. చికిత్స పొందుతూ రామాంజనేయులు మృతి చెందాడు. కుటుంబ వివరాలు తెలియాల్సి ఉంది.

మృతి చెందిన రామాంజనేయులు

డివైడర్‌ను ఢీకొన్న బైక్.. ఒకరికి గాయాలు

శింగరాయకొండ: శింగరాయ కొండ జాతీయ రహదారి పరిధిలోని కందుకూరు రోడ్డు ఫ్లైఓవర్ వద్ద బైకు డివైడరును ఢీకొని ఒక యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన చోటు చేసుకుంది. జరుగుమల్లి మండలం వావిలేటిపాడు గ్రామానికి చెందిన కంది గోపి అనే యువకుడు మోటర్ బైక్ మీద కందుకూరులోని తన చెల్లి ఇంటికి వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో మోటార్ బైక్ డివైడరును ఢీకొట్టడంతో గోపి రోడ్డుమీద పడిపోవడంతో తలకు తీవ్ర గాయం అయింది. వెంటనే 108 వాహనంలో ఒంగోలుకు తరలించారు. తలకు తీవ్ర గాయం అయిందని పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న గోపి

బస్సును ఢీకొన్న కారు.. ఇద్దరికి గాయాలు

నాగులుప్పలపాడు: కారు బస్సును ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన ఆదివారం మద్దిరాలపాడు వద్ద జరిగింది. వివరాల మేరకు ప్రయివేట్ ట్రావెల్ బస్సు ఒంగోలు నుంచి చీరాల వెళ్తుండగా ఒంగోలు వెళ్తున్న కారు ఎదురుగా వస్తున్న ట్రావెల్ బస్సును ఢీకొట్టింది. దీంతో కారు పల్టీలు కొట్టి ప్రక్కనే ఉన్న పొలాల్లో పడడంతో కారులో ఉన్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు కారులో ఉన్న వారిని బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు.

ధ్వంసమైన బస్సు ముందుభాగం

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

పొన్నలూరు: మండలంలోని చెన్నుపాడు అడ్డరోడ్డు సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి పొలంలోకి దూసుకెళ్లిన ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న రజనీకాంత్‌కు చెయ్యి ఫ్రాక్చర్ అవ్వగా, రంగస్వామికి స్వల్ప గాయాలయ్యాయి. వీరు కందుకూరు నుంచి గిద్దలూరు వెళ్లే క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. 108 సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని చికిత్స నిమిత్తం కందుకూరు ఏరియా వైద్యశాలకి తరలించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-బాపట్ల: బాపట్ల మండలం వెదుళ్ళపల్లి సమీపంలో గవినివారి పాలెం మార్గంలో గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు ఆదివారం పోలీసులకు సమాచారం అందజేశారు. వెదుళ్ళపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 45 నుంచి 50 యేళ్ల వయసు గల గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం పడి ఉన్నట్లు స్థానికులు తెలిపారన్నారు. మృతదేహం పక్కనే పురుగుమందు సీసా పడి ఉన్నట్లు గుర్తించామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. వెదుళ్ళపల్లి వీఆర్వో సత్యనారాయణ ఫిర్యాదు మేరకు వెదుళ్ళపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. మృతి చెందిన వ్యక్తి ఆచూకీ తెలిసినవారు వెదుళ్ళపల్లి ఎస్సై సెల్ 9440900869, వెదుళ్ళపల్లి వీఆర్వోసెల్ 9908403100 నెంబర్లకు తెలియజేయాలన్నారు.

మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ప్రమాద స్థలం వద్ద కూలీలు

కూలీల ఆటో బోల్తా

తృటిలో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి-పొన్నలూరు: పొన్నలూరు తహశీల్దార్ కార్యాలయం సమీపంలో ఆదివారం కూలీల ఆటో బోల్తా పడింది. ఎవరికీ ఎటువంటి గాయాలు గాని ప్రాణ నష్టం కానీ జరగలేదు. రైతు కూలీలు పొగాకు గ్రేడింగ్ కోసం కందుకూరు నుంచి రెడ్డిపాలెం వెళ్లే క్రమంలో ఆటో చెక్‌పోస్ట్ కట్ట దగ్గర బోల్టు ఊడి అనుకోకుండా ఆటో తిరగబడింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి గాయాలు జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఆటోలో మొత్తం 34 మంది రైతు కూలీలు ఉన్నారని స్థానికులు తెలిపారు. ఒకపక్క ఎస్సై అనూక్ ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇస్తుంటే వీరు మాత్రం లెక్కచేయకుండా ఆటోలలో పరిమితి మించి కూలీలను ఎక్కించుకుంటూ ప్రమాదాలకు కారణమవుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం: యర్రగొండపాలెం మండలంలోని అమానుగుడిపాడులో ఆదివారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 12 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని పి.వెంకటేశ్వర్లు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సిఐ సిహెచ్ శ్రీనివాసులు మాట్లాడుతూ సరైన అనుమతులు లేకుండా మద్యం నిల్వ చేయడం, విక్రయించడం పూర్తిగా చట్టానికి విరుద్ధం అన్నారు. ఈ తరహా కార్యకలాపాలను గుర్తించి, నిలిపివేయడమే మా బాధ్యత అని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో తనిఖీలను మరింత కఠినంగా నిర్వహించి అక్రమ మద్యం రవాణా, విక్రయాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

జూదరులు అరెస్టు

ప్రజాశక్తి-పర్చూరు: అసాంఘిక కార్యక్రమాలు చేపట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ మాల్యాద్రి హెచ్చరించారు. ఆదివారం సాయంత్రం ముందస్తు సమాచారం మేరకు నూతలపాడు గ్రామంలోని వడ్డెర కాలనీ చెరువు కట్టపై కోడిపందాలు ఆడుతున్న వారిపై దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని అన్నారు. వీరి వద్దనుండి రెండు కోడి పుంజులు, రూ.5,100 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య

ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి-కొండపి: కొండపిలో బిగ్ టివి మరియు లక్ష్మీసూపర్ స్పెషాలిటి హాస్పిటల్ సైజన్యంతో, ఫ్రెండ్స్ ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య ప్రారంభించారు. ఆదివారం కొండపిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈవైద్య శిబిరానికి 120 మందికి పైగా రోగులు హాజరయ్యారు. శిబిరానికి వచ్చిన రోగులకు ఉచితంగా రక్తపరీక్షలు, బిపి, ఈసిజి తదితర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు, ఫ్రెండ్స్ ఫౌండేషన్ సభ్యులు దామచర్ల సత్యను సన్మానించి కప్పులను బహూకరించారు. ఈ సందర్భంగా దామచర్ల సత్య మాట్లాడుతూ పేదలకు వైద్య సేవలు అందించేందుకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎఎంసీ చైర్మన్ జి.రామయ్యచౌదరి, బత్తుల నారాయణస్వామి, నరసారెడ్డి, తిప్పారెడ్డి కృష్ణారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ యం.వెంకటేశ్వర్లు, కళాశాల సిబ్బంది, మండలంలోని నాయకులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

నియోజకవర్గ సమస్యలపై 'సత్య' సమీక్ష

ప్రజాశక్తి-శింగరాయకొండ: కొండేపి నియోజకవర్గంలోని అధికారులతో ఆదివారం రాత్రి రాష్ట్ర మారి టైం బోర్డ్ చైర్మన్ దామచర్ల సత్య సమీక్ష సమావేశం నిర్వహించారు. ఒంగోలులోని క్యాంపు కార్యాలయంలో దామచర్ల సత్య కొండేపి నియోజక వర్గంలోని ఆరు మండలాల తహశీల్దార్లు, ఎంపీడీవోలతో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ అధికారులతో రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని, ఎక్కడా సమస్యలు లేకుండా చూడాలన్నారు. ఎంపీడీవోలతో సమావేశంలో గ్రామాల్లో త్రాగునీటి సమస్య లేకుండా చూడాలని ప్రతి గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా జరిగేలా చూడాలని సూచించారు. కొండేపి నియోజకవర్గ అభివృద్ధికి మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి నిధులు తీసుకొస్తున్నారని అన్ని చోట్ల అభివృద్ధి వేగవంతంగా జరగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరు మండలాల తహశీల్దార్లు, ఎంపీడీవోలు హాజరయ్యారు.

అధికారులతో సమావేశమైన దామచర్ల సత్య

రోడ్డు వెంట చేపల దుకాణాలు తొలగింపు

ప్రజాశక్తి-కొండపి: కొండపిలోని జెండా చెట్టు సెంటర్ నుంచి ఎన్టీఆర్ బొమ్మ కూడలి మధ్యలో రోడ్డు వెంబడి పాఠశాల గోడలను ఆనుకొని ఉన్న చేపల దుకాణాలను అధికారులు తొలగించారు. చేపల దుకాణాల్లో విక్రయాలు వలన పాఠశాల విద్యార్థులకు, ప్రజలకు ఇబ్బందులు జరుగుతున్నాయనదున పత్రికలో వచ్చిన కథనాలకు స్పందించిన పోలీసు అధికారులు, పంచాయతీ అధికారులు ఆదివారం చేపల దుకాణాలు తీసివేయించారు. వారికి ప్రత్యామ్నాయంగా జాళ్ల పాలెం రోడ్డులో మాంసం విక్రయాల వద్ద అమ్ముకోవాలని సూచించారు. కొండపి ఎస్ఐ ప్రేమకుమార్ స్పందించి చేపల మార్కెట్‌ను తొలగించినందుకు గ్రామస్తులు, పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. అదే విధంగా అదే రోడ్డులో రోడ్డును ఆక్రమించిన చిరు వ్యాపారస్తుల ఆక్రమణలను తొలగిస్తే ట్రాఫిక్‌కు కూడా ఇబ్బందులు లేకుండా ఉంటుందని వాహన రాకపోకలకు అంతరాయం లేకపోవడంతో పాటు పాదచారులకు సైతం ప్రమాదం లేకుండా చేసిన వారవుతారని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఆక్రమణలను వెంటనే తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చేపల మార్కెట్‌ను తొలగించిన దృశ్యం

పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

లక్ష్మికి పుట్టినరోజు శుభాకాంక్షలు

ప్రజాశక్తి - సంతమాగులూరు

తెలుగుదేశం దర్శి ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి నరసరావుపేట నుండి దర్శి వెలుతుండగా మార్గమధ్యలో మండలంలోని పుట్టావారిపాలెం అడ్డరోడ్డు జంక్షన్‌లో తెలుగుదేశం మండల నాయకులు ఆదివారం ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి గొట్టిపాటి హనుమంతరావు విగ్రహానికి పూల మాల వేసి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం టిడిపి కుటుంబ సభ్యుల మధ్య కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ తేలప్రోలు రమేష్, మాజీ ఎంపిపి సన్నెబోయిన ఏడుకొండలు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు సన్నెబోయిన గురు యాదవ్, చేవూరి వాసురెడ్డి, అట్లా పెద్ద వెంకటరెడ్డి, మక్కెన జగదీష్, నక్కా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సుబ్బారావును పరామర్శిస్తున్న తెలుగుదేశం నాయకులు

సుబ్బారావును పరామర్శించిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని రామకూరు మాజీ సర్పంచ్, తెలుగుదేశం సీనియర్ నాయకులు మానం సుబ్బారావును తెలుగుదేశం మండల నాయకులు ఆదివారం పరామర్శించారు. అనారోగ్య కారణంగా కొంతకాలం నుంచి మానం సుబ్బారావు ఇంటి వద్దనే ఉంటున్నారు. తెలుగుదేశం ఆవిర్భావం నుంచి ఆయన ఆ గ్రామంలో టిడిపికి నాయకత్వం వహించారు. సర్పంచిగా ఆ గ్రామంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో ఆయనను టిడిపి మండల అధ్యక్షులు రావూరి రమేష్ బాబు, సీనియర్ నాయకులు కుక్కపల్లి ఏడుకొండలు, చింతల సహదేవుడు, రామకూరు ఉపసర్పంచ్ పెడవల్లి అశోక్ పరామర్శించారు. ఆయన యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

కొండయ్యను శాలువాతో సత్కరిస్తున్న ప్రజా ప్రతినిధులు

మాజీ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే కొండయ్య

ప్రజాశక్తి - చీరాల

రాష్ట్ర మాజీ హెూంమంత్రి వసంత నాగేశ్వరరావును శాసన సభ్యులు మద్దలూరు మాలకొండయ్య ఆదివారం ఈతవరం నందిగామ మండలంలోని ఆయన స్వగృహానికి వెళ్లి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పలు విషయాలపై చర్చించారు. మైలవరం శాసన సభ్యులు వసంత వెంకటకృష్ణ ప్రసాద్‌ను ఆయన స్వగృహానికి వెళ్లి మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. వారు కూడా ఎమ్మెల్యే ఎంఎం కొండయ్యకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.

బర్లీ పొగాకును కొనుగోలు చేయాలి

రైతు సంఘం జిల్లా నాయకుల డిమాండ్

ప్రజాశక్తి - పంగులూరు

రైతుల దగ్గర ఉన్న బర్లీ పొగాకు నిల్వలను తక్షణమే ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు, సీనియర్ నాయకులు కందిమల్ల రామ కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానికంగా ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ రైతు, కౌలు రైతు సంఘాల పోరాటం ఫలితంగా గత నెల 29న గుంటూరులోని లామ్ యూనివర్సిటీలో పొగాకు కంపెనీ యజమానులు, రైతు సంఘాల నాయకులతో వ్యవసాయ శాఖ మంత్రి సమావేశమై చర్చించి 30నుండి నల్ల బర్లీ పొగాకు కొనుగోలు చేయాలని ఆదేశించారు. అందుకోసం నలుగురు అధికారులను పరిశీలకులుగా నియమించారని తెలిపారు. టోల్ ఫ్రీ నంబర్లు కూడా ఇచ్చారని, ఇది జరిగి 12 రోజులు అవుతున్న ఇంత వరకు ఎక్కడ విధివిధానాలు అమలు కావడం లేదని అన్నారు. ఒకటి, రెండు ఓలుపులను కాదని టాప్ ఆకులను మాత్రమే గ్రేడ్ చేయించి, క్వాలిటీ పొగాకును మాత్రమే కొనుగోలు చేస్తున్నారని అన్నారు. ఈ పొగాకు ఎకరాకు ఒకటి, రెండు క్వింటాలకు మించి దిగుబడి రాదని చెప్పారు. కంపెనీ ఏజెంట్లు

మాట్లాడుతున్న రైతు నాయకులు తలుపనేని, కందిమల్ల

గ్రామాల్లో తిరిగి మంచి పొగాకు మండెలు చూసి, దగ్గరుండి పొగాకు గ్రేడ్ చేయించి మంచి పొగాకు మాత్రమే తీసుకెళుతున్నారని, తరువాత మళ్లీ చెక్కులు పగలగొట్టి, సరుకు బాగుంటేనే ప్రాసిక్ పంపి, గేటు పాసులు ఇస్తున్నారని చెప్పారు. ఇలాగైతే తమ పొగాకు అమ్ముకోలేమని రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. పొగాకు అమ్మకాలు కాక ఆందోళన చెందుతున్న రైతులు ఈపాటికే ఆత్మహత్యల వైపు చూస్తున్నారని, ఈనెల 6న పర్చూరు మండలం వీరన్నపాలెంకు చెందిన ఒక కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్నాడని, 9న ఇంకొల్లు మండలం దుద్దుకూరు గ్రామానికి చెందిన మరో కౌలు రైతు గడ్డి మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని తెలిపారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వం రైతులను ఆదుకోవాల్సింది పోయి మీనమేషాలు లెక్కబెడుతుందని విమర్శించారు. ఇంకా ఇలాంటి దారుణాలు జరగకముందే ప్రభుత్వం మేల్కొని మంచి నిర్ణయం తీసుకుని, కంపెనీల ద్వారా పొగాకును కొనుగోలు చేయించడం కానీ లేక ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. ఈ సంవత్సరం నల్లబర్లీ పొగాకు 75 మిలియన్ కేజీలు దిగుబడి వస్తుందని కంపెనీ యాజమాన్యాలు, అధికారులు అంచనా వేస్తుండగా, 55 మిలియన్ కేజీల పొగాకు మాత్రమే ఎగుమతి ఆర్డర్లు వచ్చాయని కంపెనీ యాజమాన్యాలు చెబుతున్నాయని తెలిపారు. మిగిలిన 20 మిలియన్ కిలోల పొగాకును ప్రభుత్వమే మార్క్ఫెడ్ ద్వారా గాని, పొగాకు బోర్డు ద్వారా గాని కొనుగోలు చేయించాలని కోరారు. ఇందుకు రూ.300 కోట్లు అవసరం ఉంటుందని తెలిపారు. డిసెంబర్లో కొత్త ఎగుమతి ఆర్డర్లు వస్తాయి కాబట్టి ప్రభుత్వం తక్షణమే పొగాకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని అన్నారు. రాబోయే సంవత్సరంలో బర్లీ పొగాకు కూడా పొగాకు బోర్డులో చేర్పించాలని డిమాండ్ చేశారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - చీరాల

కార్మిక సమస్యల పరిష్కారం కోసం ఈనెల 20న జరగనున్న జాతీయ సార్వత్రిక సమ్మెలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు కోరారు. స్థానిక ఎస్‌డబ్ల్యుఎఫ్ కార్యాలయంలో సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు నాయకులు ఎన్ బాబురావు అధ్యక్షతన సిఐటియు సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు కార్యదర్శి ఎం వసంతరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 29 చట్టాల స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చిందని అన్నారు. వీటి అమలకై రాష్ట్రాల్లో అధికారులకు శిక్షణ ఇస్తున్నదని, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి చేస్తుందని అన్నారు. కనీస వేతన చట్టం రద్దు కానుందని అన్నారు. పది గంటలు పని భారం పెంచేలా కేంద్రం లేబర్ కోడ్‌లను తెచ్చిందని అన్నారు. కార్మిక హక్కుగా ఉన్న చట్టాలను రద్దుచేసి యాజమాన్యాలకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్స్ తయారు చేశారని ఆరోపించారు. దోపిడీ తీవ్రతరం చేయటానికి కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లను తెచ్చిందని, కార్మిక

మాట్లాడుతున్న సిఐటియు కార్యదర్శి ఎం వసంతరావు

చట్టాల్లోని సారాన్ని పిండి సారంలేని లేబర్ కోడ్‌ల పిప్పిని కార్మికుల ముందు ఉంచుతుందని అన్నారు. కార్మికులు ఐక్య ఉద్యమం ద్వారా తిప్పికొట్టాలని అన్నారు. మే 20న సమ్మెలో భాగంగా కార్మిక వర్గం రోడ్ల మీదకు వచ్చి నిరసన తెలియజేయాలని అన్నారు. ఈనెల 13న పట్టణ సదస్సు, 17న బైక్ ర్యాలీ చేయాలని చెప్పారు. సమావేశంలో సిఐటియు నాయకులు క్రాంతి సాగర్, ఆర్‌విఎస్ రామిరెడ్డి, ఏసురత్నం, సురేష్, కార్తీక్ పాల్గొన్నారు.

కాంక్రీట్ మిక్సింగ్ ప్లాంట్ ఎంతో అవసరం

ప్రజాశక్తి - బాపట్ల

శరవేగంతో అభివృద్ధి చెందుతున్నభవన నిర్మాణ రంగంలో అధునాతన రీతిలో అవసరమైన కాంక్రీట్ మిక్సింగ్ ప్లాంట్లు బాపట్ల ప్రాంతానికి ఎంతో అవసరమని శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. మండలంలోని పోతురాజు కొత్తపాలెం సమీపంలో రెడీమేడ్ కాంక్రీట్ మిక్సింగ్ ప్లాంటును ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ నిర్మాణాల కట్టడాలకు అవసరమయ్యే కాంక్రీట్ మిక్సింగ్ ప్లాంట్ సామాన్యులకు సైతం గృహ నిర్మాణాలకు అవసరమైన తోడ్పాటు అందించాలని అన్నారు. బాపట్ల ప్రాంత భవన నిర్మాణాల అభివృద్ధికి ఈ ప్లాంట్ ఎంతగానో దోహద పడుతుందని అన్నారు. ఈ రకమైన ప్లాంట్ వినియోగంతో ఇసుక, సిమెంటు, కంకర వంటివి

కాంక్రీట్ ప్లాంటును ప్రారంభించిన నరేంద్రవర్మ

సమపాళ్లలో మిక్సింగ్ కావడంతో నిర్మాణాల పటిష్టతకు మరింతగా తోడ్పడుతుందని అన్నారు. ఔత్సాహికులైన పరిశ్రామికవేత్తలు ఈ ప్రాంత అభివృద్ధికి అనువైన, అవసరమైన పరిశ్రమల స్థాపనకు ముందుకు రావాలని అన్నారు. దీంతో యువతకు ఉపాధి అవకాశాలతో పాటు భవన నిర్మాణ రంగం ఎంతగానో అభివృద్ధి చెందుతుందని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, ప్లాంట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

చెరుకూరు ఆలయంలో ఉత్సవాలు

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని చెరుకూరులో వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత త్రివిక్రమ స్వామి, శ్రీ గంగా, పార్వతి సమేత అగస్తీశ్వర స్వామివార్ల కళ్యాణ మహెూత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయాల ఈఓ నాగయ్య ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా రెండు ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయంలో నిర్వహిస్తున్న కోలాట, భజన, కూచిపూడి నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా భక్తులను ఆకట్టుకుంటు

కూచిపూడి నృత్యం చేస్తున్న కళాకారులు

న్నాయి. ఈనెల 12న సోమవారం స్వామివారి కల్యాణ మహెూత్సవం జరుగుతుందని చెప్పారు.

టిడిపి భీమా చెక్కు విజయ్‌కి అందించిన అక్క ఆనందబాబు

బీమా చెక్కు అందజేత

ప్రజాశక్తి - కొల్లూరు

స్థానిక ఎంప్లాయిస్ రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో తెలుగుదేశం విస్తృత స్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశంలో మండలంలోని తురకపాలెంకు చెందిన తెలుగుదేశం కార్యకర్త కొమరబత్తిన తేజ ప్రమాదవశాత్తు మృతి చెందగా టిడిపి సభ్యత్వం కార్డు కలిగి ఉన్నందున సభ్యత్వ కార్డుపై ఉన్న ప్రమాద బీమా రూ.5లక్షల విలువైన చెక్కును శాసన సభ్యులు నక్క ఆనందబాబు చేతుల మీదగా అతని కుటుంబ సభ్యులైన కొమరబత్తిన విజయ్‌కి ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకట సుబ్బయ్య, తెలుగుదేశం మండల అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కనకాల మధుసూధన ప్రసాద్ పాల్గొన్నారు.

కరదీపిక ఆవిష్కరిస్తున్న పిసి సాయిబాబు

పుస్తక పఠనంపై దృష్టి పెంచాలి

ప్రజాశక్తి - బాపట్ల

చిన్నారులకు విద్యార్థి దశ నుండే పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించి వారిని సన్మార్గంలో నడిపించడం మనందరి సామాజిక బాధ్యతని గ్రంథాలయల ఉద్యమ నాయకులు పిసి సాయిబాబు అన్నారు. మరో గ్రంథాలయ ఉద్యమ కార్యాచరణలో భాగంగా స్థానిక గ్రంథాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమాజానికో బహిరంగ లేఖ కరదీపిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు సెల్ ఫోన్ వాడకాన్ని పరిమితం చేయాలని అన్నారు. వారిని పుస్తక పఠనం వైపు దృష్టి మళ్లించడం నేటి కర్తవ్యం అన్నారు. పుస్తక పఠనం వల్ల ప్రయోజనాలు వివరించాలని అన్నారు. చిన్నారులకు మాతృభాషలోనే ప్రాథమిక విద్య జరపడం మరో ముఖ్యమైన అంశం అన్నారు. కార్యక్రమంలో చిత్రకారుడు గూడంశెట్టి వెంకటేశ్వర్లు, గ్రంథాలయాధికారి అంగలకుదురు శివాజీ గణేషన్ పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తున్న దామచర్ల

నగర అభివృద్ధే ధ్యేయం

- ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్
- నగరంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

నగర అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ తెలిపారు. ఆదివారం నగరంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. 32, 33 డివిజన్ల పరిధిలో ఎస్ఎస్ ట్యాంక్ జంక్షన్ నుంచి మామిడిపాలెం జంక్షన్ వరకు ఎస్ క్యాప్ నిధులు రూ.70 లక్షలతో చేపట్టనున్న డివైడర్, గ్రీనరీ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం 46వ డివిజన్ అల్లూరి సీతారామరాజు వీధిలో నూతనంగా కార్పొరేషన్ సాధారణ నిధులు రూ.13.45 లక్షలతో నిర్మించిన సిసి కాలువలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒంగోలు నగరంలో ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ కె వెంకటేశ్వరరావు, ఎం ఈ చంద్రయ్య, డి ఈ యేసయ్య, కార్పొరేటర్లు పెద్దిరెడ్డి నియంతకుమారి, గుట్లపల్లి మస్తానమ్మ, కాంట్రాక్టర్ పోతంశెట్టి పవన్ కుమార్, పలువురు టిడిపి నాయకులు, కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మండవ మురళీకృష్ణ

పేద విద్యార్థులకు ప్రోత్సాహం

- దోనర్స్ క్లబ్ సేవలు ఆదర్శనీయంగా ఉండాలి
- ఆంధ్రప్రదేశ్ కమ్మవారి సేవా సమాఖ్య ట్రస్ట్ చైర్మన్ మండవ మురళీకృష్ణ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

13 దోనర్స్ క్లబ్ సభ్యుల సంఖ్యను రాబోయే రోజుల్లో గణనీయంగా పెంచాలని, ఈ క్లబ్ చేస్తున్న కార్యక్రమాలు రాష్ట్రంలోని అన్ని కమ్మ సంఘాలు ఆదర్శంగా తీసుకునే విధంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ కమ్మవారి సేవా సమాఖ్య ట్రస్ట్ చైర్మన్ మండవ మురళీకృష్ణ తెలిపారు. ఈ క్లబ్ ప్రధాన ఉద్దేశ్యం ఎవరైతే ఆర్థికంగా వెనుకబడి చదువుకోలేక ఇబ్బంది పడుతున్నారో వారిని గుర్తించి ప్రోత్సహిస్తామని అన్నారు. ప్రకాశం జిల్లా కమ్మవారి సేవా సంఘం 13 దోనర్స్ క్లబ్ సభ్యుల ఆత్మీయ సమావేశం ఒంగోలు, బందావనం ఫంక్షన్ హాలులో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ విద్య, వైద్యం స్వయం ఉపాధి, క్రీడలు వంటి అంశాలకి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యా, వైద్య, వ్యాపార, ఉద్యోగ రంగాలకు చెందిన ప్రముఖులు డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, బెల్లం కోటయ్య, కామని చినబాబు, భగీరథ కెమికల్స్ జనరల్ మేనేజర్ లింగమనేని వెంకటరామయ్య, చిడిపోతు వెంకటేశ్వర్లు, పోతినేని శ్రీనివాసరావు, గోరంట్ల రవికుమార్, అలా హనుమంతరావు, కాట్రగడ్డ రఘుపతిరావు, పాటిబండ్ల వెంకటేశ్వర్లు, రావుల పద్మజ, వి.వి.సుజాత, డాక్టర్ నామినేని కిరణ్, మన్నం శ్రీనివాస్, మండవ సుబ్బారావు, పావులూరి బాపయ్య చౌదరి, టీమ్ లీడర్లు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

బాధ్యతగా పనిచేస్తా..

- 'ఉగ్ర'కు జీవితాంతం రుణపడి ఉంటా..
- డిసిఎంఎస్ అధ్యక్షులు శ్యామల కాశిరెడ్డి

శ్యామల కాశిరెడ్డి

ప్రజాశక్తి-వెలిగండ్ల

వెలిగండ్ల మండలం, వెదుళ్ల చెరువు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు శ్యామల కాశిరెడ్డి ప్రకాశం జిల్లా డీసీఎంఎస్ అధ్యక్షునిగా నియమితులయ్యారు. ఆదివారం తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం నుండి డీసీఎంఎస్ అధ్యక్షునిగా కాశిరెడ్డిని నియమించినట్లు ఉత్తర్వులు జారీ చేశారు. కనిగిరి శాసనసభ్యుడు డాక్టర్ ముక్కుఉగ్ర నరసింహారెడ్డి పట్టుదలతో ఈ పదవిని కనిగిరి ప్రాంతానికి చెందిన వ్యక్తికి వచ్చేటట్లు కషి చేశారు. గతంలో ఆయన కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కూడా వెలిగండ్ల మండలం అదే గ్రామానికి చెందిన బీరం వెంకటేశ్వరరెడ్డికి ఈ పదవిని ఇప్పించారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా పనిచేస్తూ ఉన్నప్పుడు వెలిగండ్ల మండలంపై ప్రత్యేక శ్రద్ధ చూపించి జిల్లా నామినేటెడ్ పదవులు సాధించడంలో ఎమ్మెల్యే ముందు వరుసలో ఉన్నారు. శ్యామల కాశిరెడ్డి మొదటి నుండి రాజకీయాల్లో చురుగ్గా ఉంటూ తెలుగుదేశం పార్టీ గెలుపునకు తన వంతుగా తీవ్రమైన కషి చేశారు. శ్యామల కాశిరెడ్డి మొదటి నుండి రాజకీయాల్లోనే కాక తన తండ్రి పేరు మీద శ్యామల వెంకటరెడ్డి ఫౌండేషన్ ఏర్పాటు చేసి పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విద్య, వైద్య, దైవ కార్యక్రమాలతో పాటు పేదలకు తన వంతు సహకారం అందిస్తూ స్థానిక రాజకీయాల్లో తెలుగుదేశం పార్టీ తరపున చురుగ్గా పనిచేశారు. స్థానిక ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డికి సన్నిహితంగా మసలుతూ తన వంతుగా ఎమ్మెల్యే గెలుపునకు తీవ్రమైన పట్టుదలతో కషి చేశారు. అంతేగాక ఇటు పార్టీలో కార్యకర్తలతోనూ, ప్రజలతోనూ మమేకమై వారి సమస్యల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేవాడు.

డిసిఎంఎస్ పదవి పొందిన శ్యామల కాశిరెడ్డి ప్రజాశక్తితో మాట్లాడుతూ తనకు ఈ పదవి రావటానికి అహర్నిశలూ కృషి చేసిన స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటానని తెలిపారు. రాష్ట్ర పార్టీ తన పట్ల నమ్మకంతో ఈ పదవి ఇచ్చినందుకు బాధ్యతగా పనిచేస్తూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. కనిగిరి నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డికి సహకారం అందిస్తానని తెలిపారు. సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌కు ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శ్యామల కాశిరెడ్డికి మండల నాయకులు దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, కేలం ఇంద్రభూపాలరెడ్డి, మీనిగా కాశయ్య, కర్నాటి భాస్కర్‌రెడ్డి, చిలకల వెంకటేశ్వర్‌రెడ్డి, బొబ్బు తిరుపతిరెడ్డి, కారంపూడి వెంకటేశ్వర్లు, తిట్ల లక్ష్మీనారాయణ, కేసరి రమణారెడ్డి, కొండు విజయభాస్కర్‌రెడ్డి, టి.సుబ్రహ్మణ్యం, యేరువ చెంచిరెడ్డి, చిలకల కష్టారెడ్డి, రావి శ్రీనివాసులు, గోనా ప్రతాప్, గవదకట్ల హరికృష్ణ శుభాకాంక్షలు తెలిపారు.

వైసిపి కార్యకర్తలు

బెదిరింపులకు భయపడరు..

- మాజీ మంత్రి రజనిపై పోలీస్ చర్యల పట్ల ఖండన
- వైసిపి నాయకుల ధ్వజం

మాట్లాడుతున్న చుండూరి రవిబాబు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

తమ కార్యకర్తలపై అణచివేతకు ప్రయత్నం చేస్తే ఉవ్వెత్తున ఎగసి పడతారని, బెదిరిస్తే బెదిరిపోరని వైసిపి ఒంగోలు శాసనసభ నియోజకవర్గ సమన్వయకర్త చుండూరు రవిబాబు హెచ్చరించారు. చిలకలూరిపేటలో మాజీ మంత్రి విడదల రజని వ్యక్తిగత సహాయకుడు శ్రీకాంత్‌రెడ్డిని అరెస్ట్ చేసే నెపంతో రజని పట్ల పోలీస్ అధికారుల తీరును ఖండిస్తూ ఆదివారం నాడు వైసిపి జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా రవిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని ఆరోపించారు. మహిళలకే కనీస గౌరవం లేకుండా ఈ ప్రభుత్వం వ్యవహరిస్తోందని, కూటమి ప్రభుత్వం లో మహిళలకు, ఎస్సీ, బీసీలకు రక్షణ లేకుండా పోతోందని విమర్శించారు. మాజీ మంత్రి పట్ల చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బానాయుడు అనుచితంగా ప్రవర్తించిన తీరును ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం చేయలేక పోలీసులను అడ్డు పెట్టుకుని కూటమి ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ నడుపుతోందని దుయ్యబట్టారు. దోర్నాలకు చెందిన రైతు 15 క్వింటాళ్ళ మిర్చిని గుంటూరులో అమ్మగా కేవలం రూ.90 వేలే దక్కాయని, కూలీలకే 6వేలు చొప్పున ఇవ్వాలని, 3 రోజులుగా తిండి తినలేదని రైతు పడిన ఆవేదన ఈ ప్రభుత్వం చెవిన పడలేదా.? అని ప్రశ్నించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ, బిసి సెల్ జిల్లా అధ్యక్షులు బొట్ల సుబ్బారావు, హెచ్ఎంపాడు ఎంపిపి, లీగల్‌సెల్ అధ్యక్షులు గాయం సావిత్రిరెడ్డి, మహిళా రాష్ట్ర కార్యదర్శి భూమి రెడ్డి రమణమ్మ, ఒంగోలు నియోజకవర్గ మహిళా ఇంచార్జి బడుగు ఇందిర పాల్గొన్నారు.

మాతృ దినోత్సవం వీరమాతలకు అంకితం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఈ మాతృ దినోత్సవం వీర మాతలకు అంకితం గావిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ మహిళాభ్యుదయ సమితి మరియు నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం (నరసం) ప్రకటించింది. ఆదివారం నాడు ఆంధ్రప్రదేశ్ మహిళాభ్యుదయ సమితి నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఒంగోలులోని హౌసింగ్ బోర్డులో మహిళాభ్యుదయ సమితి కార్యాలయంలో అంతర్జాతీయ మాతృ దినోత్సవం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఇటీవల ఆపరేషన్ సింధూర్‌లో వీరమరణం పొందిన మురళీనాయక్, ఇంతియాజ్‌లకు నివాళు లర్పించి, వారి తల్లులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. ఈ దినోత్సవాన్ని ఆ వీర మాతలకు అంకితం చేస్తున్నట్లు సమితి అధ్యక్షురాలు తేళ్ల అరుణ తెలిపారు. నరసం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సింహాద్రి జ్యోతిర్మయి ఆ వీరమాతలకు అంకితంగా రాసిన గేయాన్ని ఆలపించగా, మాజీ ఎంపిపి నాళం నరసమ్మ, మారేపల్లి సూర్యకుమారి, బీరం అరుణ మాట్లాడుతూ ఉగ్రవాద వ్యతిరేక పోరాటంలో తమ కుమారులను కోల్పోయిన చేసిన తల్లుల త్యాగాలను కొనియాడారు. కార్యక్రమంలో ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్ కౌన్సిలర్స్ హరిశంకర్, ప్రభుకుమారి, శక్తి సదన్ సిబ్బంది గుంటుపల్లి శ్రీదేవి, చల్లా కనకదుర్గ, మలాన్, పి.నాగేంద్రం పాల్గొన్నారు.

అమరవీరులకు నివాళులర్పిస్తున్న దృశ్యం

బాలలకు సెల్ఫ్ డిఫెన్స్‌లో శిక్షణ అవసరం

- కరాటే ట్రైనర్ చంద్రశేఖర్

కరాటేలో శిక్షణ ఇస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

సమాజంలో జరుగుతున్న పరిణామాల నేపథ్యం లో బాలికలు 'ఆత్మరక్షణ' (సెల్ఫ్ డిఫెన్స్) లో శిక్షణ అవసరమని కరాటే ట్రైనర్ చంద్రశేఖర్ సూచించారు. ఆదివారం నాడు స్థానిక ఎల్‌బిజి భవన్‌లో ప్రకాశం బాలోత్సవం ఒంగోలు చిల్డ్రన్ క్లబ్ ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మర్ క్యాంపులో ఆయన పాల్గొన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా బాలికలు విద్య, అనంతరం ఉద్యోగం ఇతర దైనందిన అవసరాల్లో ఒంటరిగా ఉండే క్రమంలో అనుకోని ఘటనలు ఎదురవుతాయని, అటువంటి పరిస్థితుల్లో ఆత్మరక్షణ కోసం మార్షల్ ఆర్ట్స్‌లో ముఖ్యమైన 'కరాటే'లో శిక్షణ పొందాలని కోరారు. ఈ సందర్భంగా బాలలకు కరాటే శిక్షణ ఇచ్చారు. శారీరక వ్యాయామం వల్ల ఆరోగ్యాన్ని కాపాడు కోవచ్చని ఆయన సూచించారు. శారీరక దారుఢ్యం కోసం ప్రతి రోజూ చేయాల్సిన వ్యాయామాలు నేర్పారు. ఆరోగ్య సూత్రాలను వివరించారు. అనంతరం మెమరీ టెక్నిక్స్ గురించి అకాడమీ ట్రైనర్ ఎస్ కె మహబూబ మెళకువలు నేర్పారు. అబ్దుల్ మాలిక్ విద్యార్థులకు దేశభక్తి గేయాలు నేర్పారు. కార్యక్రమంలో మ్యాజిక్ రామన్, వీరాస్వామి, విజయ్ పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైన దామచర్ల

విశ్వబ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి

- ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

విశ్వబ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దనరావు హామీ ఇచ్చారు. ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులుగా పిఎస్ బాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఒంగోలు గోల్డ్, సిల్వర్ మర్చంట్ అసోసియేషన్ హాలులో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని బిసిల అభివృద్ధికి టిడిపి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం బిసిల అభ్యున్నతికి అనేక పథకాలు చేపట్టిందన్నారు. బిసిల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను వినియోగించుకోవా లని సూచించారు. జిల్లాలోని విశ్వబ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని, ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణుల సంఘం అధ్యక్షులు పిఎస్ బాబు మాట్లాడుతూ జిల్లాలో విశ్వబ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, అందరి సమన్వయం చేసుకొని ముందుకు సాగుతామన్నారు. సంఘం అభివృద్ధికి సహకరిస్తున్న వారికి ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు చేపూరి రామస్వామి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫిరంగి చంద్రశేఖర్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు నీరజ రాష్ట్ర నాయకులు చందు, మాజీ కౌన్సిలర్ కొండూరి విశ్వసేన్, ఆదిమూలం సుబ్బారావు, చోడా సిద్ధార్థ, రావూరి లక్ష్మయ్య , సుతారం శ్రీనివాసరావు, పెరమన కృష్ణమాచారి, నొసం నాగేంద్ర, చిలికచర్ల ప్రకాష్ రావు, నూతక్కి వెంకటేశ్వరరావు, గోనుగుంట బ్రహ్మేంద్ర కుమార్ పాల్గొన్నారు.

తల్లులను సత్కరిస్తున్న రోటరీ ప్రతినిధులు

రోటరీ ఆధ్వర్యంలో మదర్స్ డే

ప్రజాశక్తి - అద్దంకి

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రోటరీ పూర్వ అధ్యక్షులు హాజీ సయ్యద్ మౌలాలి సౌజన్యంతో ముస్లిం షాదీఖానా బిల్డింగులో అంతర్జాతీయ మాతృ మూర్తుల దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరుగురు మాతృ మూర్తులను నూతన వస్త్రాలు, శాలువా, పూల దండలతో సత్కరించారు. బిడ్డల సంరక్షణలో వారి పురోభివృద్ధిలో తల్లి పాత్ర ఎంతో ఉన్నతమైనదని అన్నారు. తల్లులను గౌరవించి, వృద్ధాప్యంలోవారిని జాగ్రత్తగా చూసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య, సెక్రటరీ చండూరి మురళీ సుధాకరరావు, ట్రెజరర్ మల్లాది శ్రీనివాసరావు, ఎజి షేక్ మొహమ్మద్ రఫీ, డాక్టర్ దేవపాలన, పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి, విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, అద్దంకి లేవి ప్రసాద్, సంకా బాబు, అంజాద్ బాషా, జాగర్లమూడి శివ కుమారి, నర్రా శ్రీలక్ష్మి, కొల్లా భువనేశ్వరి, అలహరి హరి ప్రసాద్, కోట అంజమ్మ పాల్గొన్నారు. మురారిశెట్టి అంజనీ దేవి, ధనలక్ష్మి, ఏకుల రమణమ్మ, జుబేదాబేగం, స్వర్ణ అన్నపూర్ణమ్మ, తేళ్ల ప్రభావతి పాల్గొన్నారు.

రథం శిఖర కలశాన్ని ఈఒకు అందిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర

బాపట్లలో నేడు రథోత్సవం

ప్రజాశక్తి - బాపట్ల

బాపట్ల భావన్నారాయణ స్వామి 1432వ నవాహ్నిక వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈ నెల 12న జరిగే రథోత్సవానికి రూ.1.50కోట్లతో నిర్మించిన నూతన రథం సంప్రోక్షణను శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ దంపతులు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ సోమవారం సాయంత్రం నూతన రథోత్ జరిగే రథోత్సవానికి దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, గృహ నిర్మాణ శాఖ, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి కొలుసు పార్థసారధి, రెవిన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్, కలెక్టర్ జె వెంకట మురళి పాల్గొంటారని తెలిపారు. రథం సంరక్షణలో ఈఒ దివి వెంకటేశ్వర్లు, ఆలయ పండితులు పాల్గొన్నారు.

ఉచిత అన్న సంతర్పణ

రథోత్సవాన్ని తిలకించేందుకు విచ్చేసే సందర్శకులకు సోమవారం ఉచిత అన్నదానం నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి గుంటూరు జిల్లాల శాసన మండలి మాజీ సభ్యులు అన్నం సతీష్ ప్రభాకర్ తెలిపారు. అన్నదాన కార్యక్రమానికి ప్రజలు పాల్గొని రథోత్సవాన్ని జయప్రదం చేయాలని కోరారు.

భక్తులకు అన్నప్రసాద వితరణ

ప్రజాశక్తి - అద్దంకి

సింగరకొండపై ఉన్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఆదివారం స్వామి వారి జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. జయంతి సందర్భంగా అనేక మంది దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. స్వామి వారి మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణ, కళ్యాణ మహోత్సవం నిర్వహించి భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. కడవకుదురుకు చెందిన సోమిశెట్టి వెంకట్రావు శంకు చక్రల నామాలతో వెండి దీపారాధన కుందులు బహూకరించారు. కొబ్బరికాయలు కొట్టే స్థాండును దామ వంశీకృష్ణ జ్ఞాపకార్థం ఆయన సతీమణి రాజ్యలక్ష్మి దేవస్థానం అధికారుల సమక్షంలో అందజేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - పంగులూరు

ఎక్కడెక్కడో నివాసం ఉంటూ, ఎక్కడెక్కడో ఉద్యోగాలు చేస్తూ, విధి నిర్వహణలో బిజీబిజీగా గడిపే వారంతా 25ఏళ్ల తర్వాత తమ చిన్ననాటి స్నేహితులను కలుసుకొని, ఆనాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. మండలంలోని ముప్పవరంలోని శ్రీ పోటిబండ్ల శ్రీమన్నారాయణ చౌదరి కమిటీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. 2001-02 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులంతా హాజరై పాత మిత్రులను కలుసుకొని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ప్రస్తుత పాఠశాల హెచ్‌ఎం పుచ్చకాయల ప్రసాదు, రిటైర్డ్ హెచ్‌ఎంలు కృష్ణయ్య, కృష్ణమూర్తి మాట్లాడారు. ఈ పాఠశాల్లో చదువుకొని ఉన్నత స్థానాల్లో ఉన్న ఆనాటి విద్యార్థులు పాఠశాలను గుర్తించుకొని రావటం చాలా ఆనందంగా ఉందని అన్నారు. ఏ దేశంలో ఉన్నా, ఏ రాష్ట్రంలో ఉన్న చదువుకున్న పాఠశాలను మరిచిపోలేని విద్యార్థులను చూస్తున్నందుకు ఆనందంగా ఉందన్నారు. పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు సహకరించాలని కోరారు. పూర్వ విద్యార్థులు ఒకరినొకరు పలకరించుకొని ఆనందం వ్యక్తం చేశారు.

మాట్లాడుతున్న ముప్పవరం స్కూల్ హెచ్‌ఎం పి ప్రసాద్

ప్రతిభావంత విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి - నిజాంపట్నం

పదవ పరీక్షల్లో అత్యంత ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు యాదవపాలెం శ్రీ కోదండ రామాలయం ఆధ్వర్యంలో అభినందనలు తెలిపారు. జడ్పిటిసి నర్రా సుబ్బయ్య మాట్లాడుతూ 10వ తరగతిలో 550 మార్కులు సాధించడం గొప్ప విషయమని అన్నారు. విద్యార్థులందరూ క్రమశిక్షణతో నడుచుకొని ఉన్నత శిఖరాలు అవరోధించాలని కోరారు. కోదండ రామాలయ పరిధిలోని 550 పైగా మార్కులు సాధించిన గంగుల దేవి శ్రీ, దొంతిబోయిన రూపేష్, దొంతిబోయిన వెంకట నన్నూరమ్మ, మువ్వా శివ వీరకుమార్, కుర్రా తన్మయిశ్రీ, మరక మురారి, కుర్రా తేజ సాయిలను శాలువా, మెమెంటు, మెడల్, నగదు బహుమతితో సత్కరించారు. జడ్పిటిసి నర్రా సుబ్బయ్య తన సొంత నిధులతో జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో చదివి 585 మార్కులు సాధించి మండలం ప్రథమ స్థానం వచ్చిన దొంతిపోయిన నన్నూరమ్మకు రూ.5వేల నగదు, మిగతా ఆరుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున అందజేశారు. సభకు గంగుల సాయి రమేష్ అధ్యక్షత వహించగా దబ్బకూటి హరిబాబు మాస్టర్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. కార్యక్రమంలో మాజీ సొసైటీ అధ్యక్షులు మరక శ్రీనివాసరావు, సొసైటీ ప్రెసిడెంట్ నరేష్ యాదవ్, మాజీ ప్రెసిడెంట్ నర్రా నాగేశ్వరరావు, రిటైర్డ్ హెచ్‌ఎం మరక సుబ్బారావు, బీసీ సంఘం అధ్యక్షుడు గంగరాజు, నీటి సంఘాల అధ్యక్షుడు పోలిరాజు, నర్రా వెంకటేశ్వర్లు, రిటైర్డ్ ఆర్మీ నర్రా సుబ్బయ్య, గౌరవాధ్యక్షులు నర్రా నాగభూషణం, హాస్పటల్ అభివృద్ధి కమిటీ సభ్యులు దబ్బకూటి వెంకట బొట్లు, రిటైర్డ్ ఉద్యోగి చుక్క నరసింహారావు, పైడి నాగేంద్ర, కుర్ర శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెడ్‌పిటిసి నర్రా సుబ్బయ్య

ముగిసిన రాష్ట్రస్థాయి టోర్నమెంట్

ప్రజాశక్తి - చీరాల

మండలంలోని జాండ్రపేట బివిఅండ్‌బిఎన్ హైస్కూల్ యూత్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి రెడ్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. గత నెల 20నుంచి నిర్వహించిన టోర్నమెంట్‌లో 40జట్లు పాల్గొన్నాయి. ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో చీరాల డీసీసీ, బివి అండ్ బిఎన్ హైస్కూల్ జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. డీసీ జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 126 పరుగులు చేయగా బివి అండ్ బిఎన్ జట్టు కూడా నిర్ణీత ఓవర్లలో 126 పరుగులు చేయగా మ్యాచ్ టై అయ్యింది. దీంతో సూపర్ ఓవర్‌లో డీసీసీ 4 పరుగులు చేయగా బివి అండ్ బిఎన్ జట్టు 3 పరుగులతో సరిపెట్టుకోవడంతో చీరాల డీసీసీ జట్టు విజేతగా నిలిచింది. చీరాల డీసీసీ జట్టుకు మొదటి బహుమతి రూ.30వేలు, బివి అండ్ బిఎన్ హైస్కూలు జట్టుకు ద్వితీయ బహుమతి రూ.20వేలు, హైమా హాస్పటల్ యూత్ జట్టుకు తృతీయ బహుమతి రూ.10వేలు, వేటపాలెం ఫ్రెండ్స్ టీంకు నాలుగో బహుమతి రూ.7,500 నగదు బహుమతులు అందజేశారు.

విజేతలకు మెమెంటో అందజేస్తున్న నిర్వాహకులు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - ఇంకొల్లు

మండలంలోని గంగవరంలో ఉచిత షుగర్, బీపీ వైద్య శిబిరం మంచాల రంగమ్మ, వెంకట్రామయ్య విద్యా వైద్య వైజ్ఞానిక కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో 150 మందికి షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించారు. అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ మంచాల రమేష్, డాక్టర్ సాంబయ్య ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. కరి సత్యనారాయణ మాస్టారు జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు, భార్య సక్కుబాయమ్మ, కుమారులు గోపీకృష్ణ, అజయ్ కుమార్, కుమార్తె జీవనజ్యోతి ఈ క్యాంపుకు ఆర్థిక చేయూత అందించారు. క్యాంపు నిర్వహిస్తున్న బాలచంద్ర వైద్యులు, ఆర్థిక చేయూతనిచ్చిన కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు.

వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

గురిజేపల్లిలో బోరింగ్ ప్రారంభిస్తున్న సర్పంచి దమ్ము రమణ

నూతన బోరు ప్రారంభం

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని గురిజేపల్లిలో అన్ని సామాజిక వర్గాల ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు లేకుండా శాశ్వత పరిష్కారం చేస్తున్నట్లు సర్పంచి దమ్ము వెంకటరమణ, శ్రీనివాసరావు తెలిపారు. విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ గతంలో గ్రామంలోని బీసీ, ఎస్సీ కాలనీ ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులకు ఇచ్చిన హామీ మేరకు బీసీలు, ముస్లిం కుటుంబాలకు రూ.3 లక్షల ఖర్చుతో నూతన త్రాగునీటి బోర్లకు చేతిపంపులు బిగించి ఆదివారం ప్రారంభించామని అన్నారు. ఎస్సీ కాలనీలో రిపేర్లకు నోచుకోని బోర్లకు తిరిగి రిపేర్లు చేసి ప్రారంభించడంతో త్రాగునీటి సమస్యలు తీరాయని అన్నారు. రానున్న రోజుల్లో మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆధ్వర్యంలో మరింత అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు.

కార్యకర్తలతో సమీక్షిస్తున్న నక్క ఆనందబాబు

క్లస్టర్లను నియమించుకోవాలి

ప్రజాశక్తి - వేమూరు

నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్చార్జిలను నియమించుకోవాల్సి ఉందని శాసన సభ్యులు నక్క ఆనందబాబు కార్యకర్తలకు సూచించారు. చుండూరు బాబు కళ్యాణ మండపం, కొల్లూరులోని ఎంప్లాయిస్ రిక్రియేషన్ హాల్లో ఆదివారం తెలుగుదేశం మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. తెలుగుదేశం సంస్థాగత ఎన్నికలు పూర్తి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కుటుంబ సాధికార సారదలను ఈపాటికే నియమించుకున్నామనీ, బూతు, గ్రామ కమిటీలను నియమించుకోవాలని చెప్పారు.

భవాని సెంటర్లో ట్రాఫిక్ అంతరాయాలు

ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం

ప్రజాశక్తి - అద్దంకి

స్థానిక భవాని సెంటర్ నాలుగో రోడ్ల కూడలిలో తరచూ ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుంది. వాహనాలు రద్దీ ఎక్కువైందని చెప్పవచ్చు. నామ్ ఎక్స్ప్రెస్ హైవేపై సాధారణ వాహనాలు, భారీ వాహనాల రాకపోకలు సాగిస్తున్నాయి. పట్టణంలో రామ్ నగర్, బంగ్లా రోడ్డు, బస్టాండ్ సెంటర్, పోతురాజు గండి సమీపంలో, భవానీ కూడలిలో వందల సంఖ్యలో వాహనాలు తరచూ నిలిచిపోతున్నాయి. ప్రతినిత్యం పోలీసులు ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా చర్యలు చేపడుతున్నప్పటికీ ఇటీవల వాహనాల రాకపోకలు ఎక్కువ సాగడం వల్ల ప్రతి 10 నిమిషాలకు ఒక మారు కిలోమీటర్ల పరిధిలో ట్రాఫిక్కు నిలిచిపోతుంది. దీనిని అధిగమించాలంటే సాగర కాలువ కట్టపై మినీ బైపాస్ నిర్మాణం చేస్తున్నామని పురపాలక సంఘం ప్రకటించినప్పటికీ ఆచరణలో ఇప్పటికీ అది సాధ్యం కాలేదు. పాదచారులు రోడ్డు దాటాలంటే కనీసం 10 నిమిషాలు పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ట్రాఫిక్ అంతరాయం కలుగ కుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజాశక్తి
సోమవారం 12 మే 2025

విస్తృతంగా వాహనాల తనిఖీ

బాపట్ల కొత్త బస్టాండులో తనిఖీలు చేస్తున్న డిఎస్‌పి

వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ మీసాల వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - బాపట్ల

భారత్, పాకిస్తాన్ యద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో డిఎస్పి ఆధ్వర్యంలో కొత్త బస్టాండ్ ఆర్టీసీ కార్గో సర్వీస్ పాయింట్‌లో ఆదివారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పి రామాంజనేయులు మాట్లాడుతూ ప్రయాణికుల బ్యాగులు తనిఖీ చేయడంతో పాటు ఎక్కడికి వెళ్తున్నారనే వివరాలపై ఆరా తీశారు. కొత్త బస్టాండ్, పాత బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పదంగా తిరుగు తున్నట్లు వ్యక్తులను గుర్తించినట్లయితే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. కొరియర్ ద్వారా ఎగుమతి, దిగుమతి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి వస్తువును క్షుణ్ణంగా పరిశీలించి డెలివరీకి పంపించాలని కొరియర్ నిర్వాహకులకు సూచించారు. తనిఖీల్లో ఎఆర్ డిఎస్పీ విజయ సారథి, ఎఆర్ పోలీసులు, సీఐ రాంబాబు, ఎస్ఐ శ్రీనివాసరావు, చంద్రావతి, బాంబు స్క్వాడ్ టీం పాల్గొన్నారు.

వేటపాలెం : రోడ్డున వెళ్లే వాహనదారులు అపరిచిత వ్యక్తులకు లిఫ్ట్ ఇవ్వవద్దని ఎస్ఐ మీసాల వెంకటేశ్వర్లు సూచించారు. మండలంలోని పొట్టి సుబ్బయ్యపాలెం జంక్షన్ వద్ద వాహనాలు విస్తృతంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. తెలియని వారినీ ఎక్కించుకోవద్దని చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రధాన జంక్షన్ల వద్ద వాహనాల తనిఖీలను చేపట్టినట్లు చెప్పారు. ఎస్పీ ఆదేశాల మేరకు చీరాల డిఎస్పీ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు.

చీరాల : దేశంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితుల దృష్ట్యా అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండి ఎలాంటి అనుమానం వచ్చిన వెంటనే తమను సంప్రదించాలని సిఐ సుబ్బారావు కోరారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఆదివారం వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రాకపోకలు సాగిస్తున్న వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. వాహన దారులకు సంబంధించి సరైన ధ్రువీకరణ పత్రాలు తనిఖీ చేశారు. వాహన దారులందరూ సరైన ధ్రువీకరణ పత్రాలతో వాహనాలు నడపాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ సురేష్ బాబు పాల్గొన్నారు.

రేపల్లె : పట్టణంలో పోలీసులు ఆదివారం విస్తృత తనిఖీలు చేపట్టారు. ఎస్పీ తుషార్ డూడి అదేశాల మేరకు డీఎస్పీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో సీఐ మల్లిఖార్జునరావు, ఎస్ఐ రాజశేఖర్ స్థానిక బస్టాండు, రైల్వే స్టేషన్, ట్రెయిన్, వాహనాలు తనిఖీ చేశారు. పాకిస్తాన్ ఉగ్రదాడుల దాడి, యుద్ధం నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. ప్రయాణికుల బ్యాగులను సైతం క్షుణ్ణంగా తనిఖీ చేసినట్లు తెలిపారు. అనుమానిత వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

కారంచేడు : స్థానిక వంతెన సెంటర్లో పోలీసులు ఆదివారం వాహనాలు తనిఖీ చేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఎస్ఐ వెంకట్రావు ఆధ్వర్యంలో వాన తనిఖీలు చేపట్టారు. చీరాల, పర్చూరు వైపు ప్రయాణిస్తున్న వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానిత వాహనాల వివరాలు నమోదు చేసుకున్నారు. ప్రయాణ మార్గమధ్యలో అనుమానిత, గుర్తుతెలియని వ్యక్తులెవరైనా లిఫ్ట్ అడిగితే ఇవ్వకూడదని సూచించారు.

బస్టాండులో తనిఖీలు చేస్తున్న రేపల్లె డిఎస్పి శ్రీనివాసరావు

బస్టాండ్ వద్ద తనిఖీ చేస్తున్న చీరాల సీఐ సుబ్బారావు

వాహనాలు తనిఖీ చేస్తున్న కారంచేడు ఎస్ఐ వెంకట్రావు

బ్యాంకు ఖాతా ద్వారానే ఖర్చు పెట్టాం : రఘుపతి

ప్రజాశక్తి - బాపట్ల

బాపట్ల భావనారాయణ స్వామి ఆలయ అభివృద్ధికి విరాళాల రూపంలో వచ్చిన ప్రతి రూపాయి బ్యాంకు ఖాతా ద్వారానే వినియోగించినట్లు మాజీ శాసన సభ్యులు కోన రఘుపతి తెలిపారు. 'దేవాలయానికి వచ్చిన విరాళాల వివరాలు చెప్పాలి' అనే శీర్షికన న్యాయవాది విన్నకోట సత్యప్రసాద్ 'ప్రజాశక్తి' పత్రిక ద్వారా అడిగిన ప్రశ్నలకు ఆదివారం ఆయన తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తన బాధ్యతకు తగ్గట్టు ఆ రోజు వచ్చిన ప్రతి రూపాయి బ్యాంక్ ఖాతాలో వేసి ఎకౌంటు ద్వారా ఖర్చు పెడుతూ ప్రతిపైసా వివరంగా రాసి పెట్టామని అన్నారు. ఈ క్రమంలో ఎంతోమంది దాతలు ముందుకు వచ్చి విరాళాలు ఇచ్చారని, కొంతమంది వాళ్ళ పేర్లు ఆశించి విరాళాలు ఇచ్చారని, మరి

సమావేశంలో మాట్లాడుతున్న కోన రఘుపతి

కొంతమంది గుడి బాగుపడితే చాలని ఇచ్చారని తెలిపారు. అలాంటప్పుడు రాజకీయ నాయకుడిగా ఒక పార్టీకి అన్వయించుకొని చెబితే తప్పులేదని, రాజకీయాలు వేరు, రథోత్సవానికి ఒక్కరోజు ముందు ఆయన ఏ ఉద్దేశంతో అడుగుతున్నారో తెలుసుకుందామని సత్యప్రసాద్‌కు తాను రెండుసార్లు ఫోన్ చేశానని, ఆయన స్పందించలేదని తెలిపారు. ఆయన స్పందించి ఉంటే ఈరోజు ప్రెస్ మీట్ పెట్టేవాడిని కాదన్నారు. ఆయన్నే నేరుగా అడిగావాడినని అన్నారు. ఆ కమిటీ వారి తరపున ఆరోజు ఉన్న శాసన సభ్యుడిగా అన్ని చక్కగా అన్నీ జరిగాయని, ఏ ఒక్క రూపాయి వృధా కాలేదని, ప్రతిదీ బ్యాంకు ద్వారానే ఖర్చులు పెట్టినట్లు తెలిపారు. లేనిపోని అపోహలు సృష్టించే ప్రయత్నం చేయొద్దని కోరారు. రథోత్సవానికి తనను ఆహ్వానించలేదని, కానీ సాధారణ భక్తునిగా రథోత్సవానికి హాజరై సాధారణ భక్కునిగా వరుసలో వెళ్లి కొబ్బరికాయ కొడతానని అన్నారు. సమావేశంలో వైసిపి నాయకులు కోకి రాఘవరెడ్డి, ఎఱ్రయ్య, జోగి రాజా పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న రోటరీ, వాకర్స్ ప్రతినిధులు

రోటరీ ఆధ్వర్యంలో సమైక్యతా ర్యాలీ

ప్రజాశక్తి - చీరాల

స్థానిక వాకర్స్ అసోసియేషన్, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో భారత వీర జవాన్లుకు సంఘీభావంగా సమైక్యతా ర్యాలీ మునిసిపల్ ఆఫీసు, బస్టాండ్ సెంటర్, గడియారం స్తంభం సెంటర్, ముంతావారి సెంటర్ మీదుగా రోటరీ క్లబ్ వరకు ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో పోలుదాసు రామకృష్ణ, సిహెచ్ బాల వెంకటేశ్వరరావు, చారగుళ్ళ గురు ప్రసాద్, నక్కల సురేష్ బాబు, వలివేటి మురళీకృష్ణ, గ్రంధి నారాయణమూర్తి, డివి సురేష్, గుర్రం రాఘవరావు, బదిరి ,రమేష్, పూర్ణా, వాకింగ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - చీరాల

ప్రభుత్వ పథకాలు వినియోగించుకోటంలో నాయి బ్రాహ్మణులు చైతన్యవంతంగా వ్యవహరించాలని నాయి బ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు కోరారు. ఆంధ్రప్రదేశ్ నాయి బ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం చీరాల రామాపురం అలా బీచ్ రిసార్ట్స్‌లో జిల్లా అధ్యక్షుడు డాక్టర్ తాడివలస దేవరాజు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. సమావేశంలో డాక్టర్ హైమా సుబ్బారావు మాట్లాడుతూ సంఘీయుల సమస్యల పట్ల చైతన్యంతో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మల్కాపురం కనకారావు, అన్నవరపు బ్రహ్మయ్య మాట్లాడుతూ సంక్షేమ సంఘం నిర్వహించిన కార్యక్రమాల ద్వారానే రాష్ట్రంలోని ఆలయాల కేసుఖండన కార్మికుల జీతాలు పెరిగాయని తెలిపారు. నాయి బ్రాహ్మణులను చైతన్య పర్చటానికి ప్రతి జిల్లాలో

మాట్లాడుతున్న కొమ్మాలపాటి భానుప్రసాద్

సదస్సులు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మవాకి భాను ప్రసాద్, సహ అధ్యక్షులు ఎం బాలయ్య, గౌరవ అధ్యక్షులు పాత్తూరు గురుస్వామి, సంఘం రాష్ట్ర గౌరవ సలహాదారు కనుపర్తి జానకిరామ్, గౌరవ వృత్తిదారుల కన్వీనర్ రాయవరపు గణపతి, వెంకటేశ్వర్లు, భాను ప్రసాద్, హెడ్మాస్టర్ వెంకటేశ్వర్లు, మార్కాపురం వెంకట రామారావు, ఆర్ఎంపి రమేష్, శ్రీనివాస్, రామాంజనేయులు పాల్గొన్నారు.

అమరజవానుల విగ్రహాలు నిర్మించాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మాట్లాడుతున్న ఎంపిపి డివి లలిత కుమారి

భారత్, పాకిస్తాన్‌కు జరిగిన యుద్ధంలో దేశ రక్షణ కోసం ప్రాణ త్యాగం చేసిన వీర జవాన్‌లు దేశానికి గర్వ కారణమని, అలాంటి వారికి ఆయా గ్రామాల్లో విగ్రహాలు నిర్మించి గౌరవించాల్సిన బాధ్యత ఉందని ఎంపిపి డి వి లలిత కుమారి అన్నారు. మదర్స్ డే సందర్భంగా భరత మాత ముద్దుబిడ్డ సత్యసాయి జిల్లా వాసి సరిహద్దు ప్రాంతం కాల్పుల్లో మృతి చెందిన మురళి నాయక్‌కు ఆమె ఘనంగా నివాళులర్పించారు. దేశ రక్షణ కోసం త్యాగం చేసిన వీరులను దేశం ఎన్నటికీ మర్చిపోదని అన్నారు. వారికి త్యాగాలకు గుర్తుగా స్వగ్రామాల్లో విగ్రహాలు నిర్మించి గౌరవించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

మురళి నాయక్‌కు నివాళులర్పిస్తున్న బోస్ నగర్ వాసులు

కొల్లూరు : పాకిస్థాన్ సైన్యం మీద వీరోచితంగా యుద్ధభూమిలో పోరాడి అమరులైన మా బంజారా బిడ్డ మురళి నాయక్‌కు బోస్ నగర్ తండా కాలనీ వాసులు ఆదివారం నివాళులర్పించారు. కార్యక్రమంలో జగదీష్ నాయక్, బద్రి, మణికంఠ, దుర్గ, గోపి, యశ్వంత్ నాయక్, పృధ్వినాయక్, మురళి నాయక్ పాల్గొన్నారు.

సంతమాగులూరు : మండలంలోని కామేపల్లిలో ఆదివారం క్రీస్తు సంఘం పాస్టర్ డాక్టర్ బొంతా స్వర్ణ రాజు, సంఘ సభ్యులు ఆధ్వర్యంలో చర్చి ఆరాధన సమయంలో భారత్, పాకిస్తాన్ మధ్య జరిగిన యుద్ధంలో పాక్ కాల్పుల్లో వీరమరణం పొందిన మురళి నాయక్‌కు ఆత్మ శాంతి కలగాలని, ఆయన విడిచి వెళ్లిన కుటుంబ సభ్యుల కోసం ప్రార్ధన చేశారు. లక్కె పోగు బెంజమ్మ, బాబు శ్యాం ప్రసాద్, ఎస్తేరా రాణి పాల్గొన్నారు.

కౌలు గుర్తింపు కార్డులు తప్పనిసరి

ప్రజాశక్తి - పంగులూరు

కౌలు వ్యవసాయం చేసే రైతులంతా తప్పనిసరిగా కౌలు గుర్తింపు కార్డులు తీసుకోవాలని తహశీల్దారు పి సింగారావు ఆదివారం కోరారు. ఇందుకోసం కౌలు రైతులు ఆయా గ్రామాల్లోని విఆర్ఒలను కలిసి ఈనెల 31లోపు కౌలు కార్డులు తీసుకోవాలని అన్నారు. కౌలు గుర్తింపు కార్డు తీసుకోవటానికి భూమి యజమాని పాస్ పుస్తకం, భూమి యజమాని ఆధార్ కార్డు జిరాక్స్, భూ యజమాని మొబైల్ నెంబరు, కౌలుదారుని ఆధార్ కార్డు, కౌలుదారుని బ్యాంక్ అకౌంట్ జిరాక్స్, కౌలుదారుని పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు కావాలని తెలిపారు. వీటితో విఆర్ఒ దగ్గర దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. కౌలు రైతు పండించే పంటను ప్రభుత్వ రికార్డులో నమోదు చేస్తుంటారని, పకృతి వైపరీత్యాల వలన పంట నష్టం జరిగినప్పుడు పంటల భీమా కౌలు రైతుకు వర్తింప చేస్తారని తెలిపారు. వ్యవసాయానికి అవసరమైన ఇన్పుట్ సబ్సిడీని కౌలు రైతులకు వర్తింప చేస్తారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ వంటి పథకాలతో పంటలకు పెట్టుబడి సహాయాలు అందుతాయని అన్నారు. ఈ కౌలు కార్డు వలన పంట రుణాలు పొందే అవకాశం ఉందని, సబ్సిడీతో విత్తనాలు, మందులు పొందవచ్చుని, కనీస మద్దతు ధరతో పండించిన పంటలు అమ్ముకోవచ్చుని అన్నారు. విఆర్ఒ లాగిన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు చేసిన రెండు లేదా మూడు రోజుల్లో మాత్రమే కార్డు ఇస్తారని చెప్పారు. ప్రతిఏటా మే నుండి ఆగస్టు మధ్యలో ఇస్తారని తెలిపారు. దీనివలన భూయజమానికి కౌలు రైతుకు ఇద్దరికీ లాభం ఉంటుందని, ప్రభుత్వ ప్రయోజనాలు ఇద్దరు ఒకేసారి పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. కౌలు కార్డు పొందిన కౌలు రైతుకి ఆ భూమిపై ఎటువంటి యాజమా న్యపు హక్కులు ఉండవని, కేవలం ఆ భూమిలో 11 నెలల కాలానికి కౌలుకు పెట్టుబడి పెట్టి వ్యవసాయం చేయడం వలన ప్రభుత్వాలు అలాంటి వారికి కూడా సాయం చేస్తుందని చెప్పారు. పొలం కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్న ప్రతి కౌలు రైతు తప్పనిసరిగా కౌలు కార్డు పొందాలని సూచించారు.

'లైవ్ స్టాక్' చైర్మన్‌గా షేక్ రియాజ్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

రియాజ్

ఆంధ్రప్రదేశ్ లైవ్ స్టాక్ డెవలప్మెంట్ ఏజెన్సీ(ఎపిఎల్ డిఎ) ఛైర్మన్ గా జనసేన పార్టీ ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్ నియమితులయ్యారు. ఎపిఎల్‌డిఎ ఛైర్మన్ గా రియాజ్‌ను నియమిస్తూ ఆదివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. షేక్ రియాజ్ 1999 సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీలో రాజకీయ అరంగేట్రం చేశారు. 2004 వరకు కాంగ్రెస్ పార్టీలో కొనసాగిన షేక్ రియాజ్ మాజీ ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డితో విభేదించి పార్టీ నుంచి బయటకు వచ్చారు. ప్రముఖ హీరో, మెగా స్టార్, చిరంజీవి పై ఉన్న ఉన్న అభిమానంతో 2009లో "షేక్ రియాజ్ ప్రజారాజ్యం పార్టీలో చేరారు. అక్కడ యువరాజ్యం రాష్ట్ర అధ్యక్షునిగా ఉన్న పవన్ కళ్యాణ్ తో కలసి యువరాజ్యం కోఆర్డినేటర్ రాష్ట్రం మొత్తం పర్యటించారు. తరువాత 2010లో ప్రజా రాజ్యం రాష్ట్ర కార్యదర్శిగా షేక్ రియాజ్ నియమితులై పార్టీ అభివృద్ధికి విశేష కృషి చేశారు. అనంతరం పరిణామాల నేపథ్యంలో ప్రజారాజ్యం పార్టీ కాంగ్రెస్ పార్టీలో విలీనమైంది. 2014లో పవన్ కళ్యాణ్ జనసేన పార్టీ స్థాపించటంతో షేక్ రియాజ్ అందులో చేరారు. పవన్ కళ్యాణ్ సేవాదళ్ రాష్ట్ర ఇన్చార్జిగా షేక్ రియాజు పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ నియమించారు. 2019 ఎన్నికలలో ఒంగోలు నియోజకవర్గంలో జనసేన పార్టీ అభ్యర్థిగా షేక్ రియాజ్ పోటీ చేసి ఓడిపోయారు. 2019 నుంచి జనసేన పార్టీ ఉమ్మడి ప్రకాశం జిల్లా అధ్యక్షులుగా షేక్ రియాజ్ కొనసాగుతున్నారు. 2024 ఎన్నికలలో రాష్ట్రంలో టిడిపి-జనసేన, బిజెపి కూటమిగా ఏర్పడి ఘన విజయం సాధించింది. జనసేన పార్టీ అధ్యక్షునిగా షేక్ రియాజ్ 2024 ఎన్నికలలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు గెలుపుకు విశేష కృషి చేశారు. ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆశీస్సులతో షేక్ రియాజ్ రాష్ట్ర స్థాయి పదవిని పొందారు.

నేడు 'శ్రీ హర్షిణి' ఇంజినీరింగ్ కాలేజి ప్రారంభం

హాజరుకానున్న మంత్రులు గొట్టిపాటి, డిబివి స్వామి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మద్దిపాడు మండలం ఏడుగుండ్లపాడులో శ్రీ హర్షిణి మహిళా ఇంజినీరింగ్ కళాశాల సోమవారం ప్రారంభమవుతుంది. మహిళా ఇంజినీరింగ్ కళాశాలను రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి ప్రారంభించను న్నారు. కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా, జిల్లా ఎస్పి ఏఆర్ దామోదర్ పలువురు ఎమ్మెల్యేలు కార్యక్రమంలో పాల్గొననున్నారు. 2025-26 విద్యా సంవత్సరం నుంచి శ్రీ హర్షిణి మహిళా ఇంజినీరింగ్ కళాశాల అందుబాటులోకి రానుంది. శ్రీ హర్షిణి విద్యా సంస్థల ఛైర్మన్ గోరంట్ల రవికుమార్, సెక్రటరీ, కరస్పాండెంట్ గోరంట్ల కవిత , డైరెక్టర్లు డాక్టర్ హర్షిణి, జివి హర్షిత్ పర్యవేక్షణలో మహిళా ఇంజినీరింగ్ కళాశాలను నిర్వహించనున్నారు. మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో బిటెక్, ఎంబిఎ, ఎసిసిఎ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. సువిశాలమైన ప్రాంగణం, అత్యాధునిక ల్యాబ్, విశాలమైన గ్రంథాలయం, ఇంటి తరహా భోజనం ఏర్పాటు చేయనున్నారు. ఈసందర్భంగా శ్రీ హర్షిణి విద్యా సంస్థల అధినేత గోరంట్ల రవికుమార్ మాట్లాడుతూ తమ విద్యా సంస్థలు ఒంగోలు, మార్టూరు, అద్దంకి, ఏడుగుండ్లపాడులో ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్థులకు విద్యను అందిస్తూ విజయవంతంగా సాగుతునాయ న్నారు. జిల్లాలో మొట్టమొదటి మహిళా ఇంజినీరింగ్ కళాశాలను రాష్ట్ర మంత్రులు ప్రారంభిస్తారని, కలెక్టర్, ఎస్పి, ఒంగోలు, సంతనూతలపాడు ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధనరావు, బిఎన్ విజయ్‌కుమార్, ఏలూరి సాంబశివరావు పాల్గొంటారన్నారు. మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రారంభోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

జిల్లావ్యాప్తంగా ఆకస్మికంగా తనిఖీలు

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

ప్రస్తుతం దేశంలో నెలకొన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపిఎస్ ఆదేశాల మేరకు జిల్లాలోని రైల్వే స్టేషన్ లు, బస్టాండ్లు, జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఆదివారం జిల్లా పోలీస్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. సాయంత్రం 4:00 గంటల నుండి 6:00 గంటల వరకు తనిఖీలను నిర్వహించారు. అనుమానాస్పద వ్యక్తుల చొరబాటును నిరోధించి, నిషేధిత, పేలుడు పదార్థాల అక్రమ రవాణాను అడ్డుకోవడమే ముఖ్య ఉద్దేశ్యంతో ఈ తనిఖీలను నిర్వహించడం జరిగింది. శాంతిభద్రతలకు ముప్పు వాటిల్లే విధంగా సంఘ విద్రోహ చర్యలకు పాల్పడే అవకాశం ఉన్న అసాంఘిక శక్తులను గుర్తించేందుకు పోలీసు బృందాలు ఆకస్మికంగా ఆయా ప్రదేశాల్లోకి ప్రవేశించి అనుమానితుల లగేజీలు, బ్యాగులు, ఇతర వస్తువులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వారి యొక్క గుర్తింపు కార్డులు, ప్రయాణం గమ్యం, ఉద్దేశ్యం వంటి వివరాలను సేకరించారు. ప్రజల భద్రతే ప్రథమ కర్తవ్యముగా జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ప్రజల రక్షణకు దృఢమైన ముందస్తు భద్రతా చర్యలు చేపట్టారు. ఈ తనిఖీలలో పోలీస్ జాగిలాలను కూడా వినియోగించడం జరిగింది. బాపట్ల, చీరాల రైల్వే స్టేషన్ లలో, రైల్వే ట్రాక్ ల వెంట జాగిలాలతో తనిఖీలు చేయడం జరిగింది. పార్సిల్‌లను, లాగేజీలలో అనుమానాస్పద వస్తువులను గుర్తించేందుకు జాగిలాలచే తనిఖీ చేయించడం జరిగింది.0

'వేసవి పత్తి' సాగుకు గిరాకీ

- నియోజకవర్గంలో ఐదు వేల ఎకరాలకుపైనే సాగు
- సాగులో ఎకరాకు రూ.30 వేలకుపైనే పెట్టుబడులు
- సాగు చేసిన నాలుగు నెలలకే దిగుబడులు
- వ్యవసాయ బోర్లు, బావుల కింద సాగు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఈ ఏడాది వేసవి పత్తి సాగుపై రైతులు దృష్టి సారించారు. యర్రగొండపాలెం నియోజకవర్గంలో విస్తారంగా పత్తి సాగవుతోంది. మామూలుగా ఏప్రిల్ మొదటి వారం నుంచే రైతులు పత్తి సాగుపై దృష్టి పెట్టారు. వ్యవసాయ బోర్లు, బావుల కింద విస్తారంగా పత్తి పంటను రైతులు సాగు చేస్తున్నారు. వేసవిలో అరి, మిరప, పత్తి పంటలను మాత్రమే సాగు చేయవచ్చు. ఈ పంటల సాగుకు ఇదే అదును. దీంతో రైతులు పత్తి సాగు ముమ్మరం చేశారు. పత్తి పంటను డ్రిప్ ద్వారా, నీటి పారుదల కింద సాగు చేశారు. ఇప్పటి నుంచి జూన్ వరకు భూములను బీడుగా ఉంచలేక రైతులు పత్తి పంటను ఎంచుకుంటున్నారు. అయితే పత్తి సాగు చేశాక వేసవిలో నీటితడులు అందించడం రైతులకు భారంగా మారుతోంది. వేసవిలో యర్రగొండపాలెం నియోజకవర్గంలో ఐదు వేల ఎకరాలకు పైనే సాగవుతోంది. నియోజకవర్గంలోని యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, పెద్ద దోర్నాల, పెద్దారవీడు మండలాల్లో అత్యధికంగా పత్తి సాగు చేస్తారు. ఎక్కువగా నాయక్, ఆర్మీ, సూపర్ బంటు, నందిని, తేజ తదితర రకాలను ఈ ప్రాంతంలో ఎక్కువగా సాగు చేస్తారు. పత్తి సాగు చేసినప్పటి నుంచి దిగుబడులు వచ్చేవరకు నీటితడులు ఇవ్వాల్సి ఉంటుంది. ముందస్తు వర్షాలు రాకపోతే ఎక్కువ తడులు నీటిని ఇవ్వాల్సి ఉంటుంది. పంట కాపునకు వచ్చే దశలో వర్షాలు పడితే పంట ఏపుగా పెరుగుతుందని వర్షాలు లేకపోతే పంట గిటకబారి పోతుందని రైతులు అంటున్నారు.

ఎకరాకు రూ.30 వేలకుపైనే పెట్టుబడులు..

పత్తి సాగులో పెట్టుబడులు పెరిగిపోతున్నాయి. ఎకరాకు రూ.30 వేలకు పైనే సాగులో రైతులు పెట్టుబడులు పెడుతున్నారు.

మార్కెట్ ధరలు ఉంటే సాగులో ఆదాయమే..

పత్తికి మార్కెట్లో ధరలు ఉంటే ఆదాయం ఉంటుంది. గత ఏడాది క్వింటా రూ.7,300ల నుంచి రూ.8200ల వరకు ధర పలికింది. సాగులో దిగుబడులు ఆశాజనకంగా ఉండటంతో రైతుకు ఆదాయం వచ్చింది. ఈ ఏడాది మార్కెట్ ధరలు ఉంటాయనే ఆశతో రైతులు ఉన్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ఇపటికే ఐదు వేల ఎకరాలకుపైనే పత్తి సాగవుతుంది. ఇంకా ఖరీఫ్‌లో మరో 12 వేల ఎకరాల్లో ఈ ప్రాంతం వేసవి పత్తి సాగుకు అనుకూలం. దీంతో రైతులు వేసవి పత్తిని ఎంచుకుంటున్నారు.

ఆదాయం ఉంటుందనే సాగు చేశా

దుగ్గినేని శివయ్య, రైతు, వాదంపల్లి

ఈ ఏడాది పత్తి పంటలో ఆదాయం ఉంటుందనే సాగు చేశా. పంటలో తెగుళ్ల నివారణ జాగ్రత్తలు తీసుకోవాలి. ఇందుకోసం నాలుగైదు సార్లు మందులను పిచికారి చేస్తాం. ఎకరాకు 13 క్వింటాళ్లకుపైనే దిగుబడులు వస్తాయనే ఆశతో ఉన్నాం. మార్కెట్ ధరలు నిలకడగా ఉంటే పత్తి సాగు ఆదాయమే.

'సాయంత్రం ఓపీ'పై ప్రత్యేక శ్రద్ధ

- సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలే లక్ష్యం
- పారిశుధ్య నిర్వహణకు చర్యలు
- ఆగస్టు నాటికి క్రిటికల్ కేర్ యూనిట్ పూర్తి
- జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏ.ఏడుకొండలరావు


ముఖాముఖి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల(జిజిహెచ్)లో సూపర్‌స్పెషాలిటీ వైద్య సేవలు అందించటమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ ఏ.ఏడుకొండలరావు తెలిపారు. జిజిహెచ్‌లో పారిశుధ్యం మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నామన్నారు. సాయంత్రం వేళలలో ఓపి చూసేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. ఆగస్టు నాటికి క్రిటికల్ కేర్ యూనిట్ పనులు, హాస్టల్ నిర్మాణ పనులు, ఏ/సి ఎగ్జామ్ సెంటర్ నిర్మాణ పనులను పూర్తి చేస్తామన్నారు. అందరి సహకారంతో జిజిహెచ్‌లో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తామంటున్న ఆయనతో 'ప్రజాశక్తి' ముఖాముఖి..

ఒంగోలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు రోజుకి 1100 నుంచి 1200 మంది ఓపి వస్తోంది. క్యూ లైన్‌లో నిలబడకుండా ఉండేందుకు ఆసుపత్రి ఆవరణలో కుర్చీలు, కొన్ని బల్లలు వేయించాం. వచ్చే రోగులకు ఎన్టీఆర్ వైద్యసేవలో ఆరోగ్య మిత్రలు సహకరిస్తున్నారు. వేసవి కాలం దృష్ట్యా వారికి తాత్కాలికంగా మంచినీటి సదుపాయాన్ని ఏర్పాటు చేశాం. త్వరలోనే మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతాం. సాయంత్రం వేళల్లో ఓపి చూడటం లేదని కొందరు చేసిన ఫిర్యాదుల మేరకు.. ఈ ఓపీ సేవలను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

అబాలో రిజిస్ట్రేషన్ తప్పనిసరి

ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా ఆసుపత్రికి వచ్చే రోగులు రిజిస్ట్రేషన్ చేయించుకోవటం తప్పనిసరి. రోగులు వారితో పాటు ఆధార్ కార్డు, ఎన్టీఆర్ వైద్యసేవ కార్డు, ఏదైనా ఫోన్ తీసుకురావాలి. ఓపిలో వీటిని చూపితే రిజిస్ట్రేషన్ చేసుకొని వారికి 14 నెంబర్ల ఐడి ఫోన్‌కు వస్తుంది. ఈ రిజిస్ట్రేషన్ ద్వారా రోగి గతంలో ఎలాంటి వ్యాధులతో బాధపడ్డారు.. ఎలాంటి చికిత్సలు తీసుకున్నాడనే సమాచారం దేశవ్యాప్తంగా ఎక్కడైనా తెలుస్తోంది. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించి రిజిస్ట్రేషన్ ప్రక్రియలో పాల్గొనాలి

రోగులకు సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు

జిజిహెచ్‌కు వచ్చే రోగులకు సూపర్ స్పెషాలిటీ సేవలు అందించనున్నాం. ప్రస్తుతం న్యూరో సర్జరీ, కార్డియాలజీ సేవలు అందుబాటులో ఉన్నాయి. ఇటీవల క్యాథ్ ల్యాబ్‌ను ప్రారంభించి రోగులకు వైద్యసేవలందిస్తున్నాం. యూరాలజీ, ప్లాస్టిక్ సర్జరీ, సర్జికల్ ఆంకాలజీ సేవలను కొనసాగిస్తున్నాం. కేన్సర్ రోగులకు అవసరమైన యూనిట్‌ను త్వరలో ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. ప్రస్తుతం గుంటూరు, విజయవాడలలో కేన్సర్ రోగులు కీమో థెరపీ చేయించుకుంటున్నారు. జిజిహెచ్‌లో రేడియాలజీ సేవలు అందిస్తున్నాం. కేన్సర్ యూనిట్ ప్రారంభమైతే కీమో థెరపీ సేవలు అందించేందుకు అవకాశం ఉంటుంది.

పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు

జిజిహెచ్‌లో పారిశుధ్యం మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఏజెల్ సంస్థ ప్రస్తుతం పారిశుధ్య నిర్వహణ పనులు చేపడుతోంది. ఆసుపత్రి ఆవరణలోని ఫ్లోరింగ్, ఎక్కడా చెత్తచెదారం లేకుండా శుభ్రం చేయిస్తున్నాం. బయో వేస్ట్ సైతం ఎప్పటికప్పుడు బయటకు తరలించేలా చూస్తున్నాం.

ఆగస్టు నాటికి క్రిటికల్ కేర్ యూనిట్ పూర్తి

జిజిహెచ్‌లో క్రిటికల్ కేర్ యూనిట్ పనులను ఆగస్టు నెలాఖరు నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. వీటితో పాటు వైద్య విద్యార్థుల హాస్టల్ భవనాలు, 200 మంది వైద్య విద్యార్థులు కూర్చొని పరీక్ష రాసేలా నిర్మిస్తున్న భవనాలను సైతం ఆ లోపు పూర్తి చేయటానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

యుజి సీట్ల పెంపునకు ప్రతిపాదనలు

ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాలలో అండర్ గ్రాడ్యుయేషన్(యుజి) సీట్లు 120 ఉన్నాయి. వీటికి అదనంగా మరో 50 సీట్లు కేటాయించాలని నేషనల్ మెడికల్ కౌన్సిల్‌కి ప్రతిపాదనలు, అఫిడవిట్ పంపి అందుకు అవసరమైన ఫీజు చెల్లించాం. ఈ ప్రతిపాదనలపై 2-3 నెలల్లో స్పష్టత రావచ్చు. పిజి సీట్ల పెంపుదలపై వచ్చే ఏడాది దరఖాస్తు చేస్తాం. అందరి సహకారంతో జిజిహెచ్‌ను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తా.